ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని అర్‌డిఓ పరిశీలన

విశాలాంధ్ర-తెర్లాం : మండలంలో బుధవారం పెరుమాలి గ్రామంలో ఏపి మోడల్ స్కూల్‌లో ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని అర్‌డిఓ జే బి.ఎస్ ఎస్ రామ్మోహన్ రావు పరిశీలించారు. తనతో పాటు తెర్లాం తహసీల్దార్ హేమంత్ కుమార్ పాల్గొన్నారు.అక్కడ ప్రిన్సిపాల్ జ్యోతి లక్ష్మీని వివరాలు అడిగి తెలుసుకున్నారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరుగుతున్నాయి అని ప్రిన్సిపాల్ తెలిపారు.అనంతరం పెరుమాలి గ్రామం రెవెన్యూ పరిధిలోగల గెడ్డ చెరువులో సబ్‌స్టేషన్ కు స్థలాన్ని పరిశీలిస్తూ వివరాలు తహసీల్దార్‌ను అర్‌డిఓ అడిగి తెలుసుకున్నారు. తనతోపాటు ఎండిఓ ఆర్ రాంబాబు ఇరిగేషన్ అధికారులు, అర్ఐ కృష్ణమూర్తి, సర్వేయర్, పలువురు విఆర్వోలు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులంతా మార్చి 16లోగా ఆన్‌లైన్ శిక్షణ పూర్తిచేయాలి

ఐగాట్ కర్మయోగి ద్వారా మూడు అంశాల్లో ప్రతి ఉద్యోగికి శిక్షణ

జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్ ఆదేశం

విశాలాంధ్ర-విజయనగరం : జిల్లాలోని ప్రభుత్వ ఉద్యోగులంతా మార్చి 16వ తేదీలోగా ఐగాట్ కర్మయోగి పోర్టల్ ద్వారా తప్పనిసరిగా ఆన్‌లైన్ శిక్షణ పూర్తిచేసుకోవాలని జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్ ఆదేశించారు. ప్రభుత్వ ఉద్యోగుల శక్తి సామర్థ్యాలను పెంచడానికి కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం యీ ఆన్‌లైన్ శిక్షణ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖల డిడిఓలతో బుధవారం నిర్వహించిన ఆన్‌లైన్ సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తమ పరిధిలోని ఉద్యోగులంతా మూడు అంశాలపై తప్పనిసరిగా శిక్షణ పూర్తిచేసుకొనేలా చర్యలు చేపట్టాలన్నారు. ఉద్యోగుల ప్రవర్తన నియమావళి, పర్యావరణ అంశాలపై అవగాహన, నైతిక పాలన తదితర అంశాలపై శిక్షణలు పూర్తిచేయాలన్నారు. కర్మయోగి శిక్షణ పూర్తిచేయడంలో ఆయా విభాగాధిపతులంతా ప్రత్యేక శ్రద్ధ కనబరచి నిర్ణీత గడువులోగా ఉద్యోగులు శిక్షణ పూర్తిచేసేలా చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో యీ శిక్షణ కార్యక్రమాల నిర్వహణకు ముఖ్య ప్రణాళిక అధికారి పి.బాలాజీ సమన్వయ అధికారిగా వ్యవహరిస్తారని చెప్పారు. రాష్ట్ర ప్రణాళిక విభాగం నుంచి వెంకటేశ్వర రావు తదితరులు పాల్గొని ఉద్యోగులకు ఆన్‌లైన్ శిక్షణపై అవగాహన కల్పించారు.

27వ జాతరలో అమ్మవారి ఆదాయం రూ.24 లక్షల 66,278లు

విశాలాంధ్ర-చీపురుపల్లి : విజయనగరం జిల్లా,చీపురుపల్లి మండలం చీపురుపల్లిలో వేంచేసియున్న శ్రీకనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం నందు 27వ వార్షిక జాతర మహోత్సవములు సందర్భముగా 266278 రూపాయలు ఆదాయం వచ్చినట్లు ఈవో బి.శ్రీనివాసరావు తెలిపారు. మార్చి నెల రెండు మూడు నాలుగు తేదీలలో జరిగిన అమ్మవారి జాతర సందర్భంగా ఆలయమునకు వచ్చిన ఆదాయమును దేవాదాయశాఖ తనిఖీదారు జి.శ్యాంప్రసాద్ స్థానిక పెద్దలు సమక్షంలో బుధవారం ఆలయ ప్రాంగణంలో హుండీలు టికెట్లు ఆదాయమును లెక్కించారు. 100 రూపాయల టికెట్ల ద్వారా విరాళాల ద్వారా 17,436 రూపాయలు, కుండీల లెక్కింపు ద్వారా 14 లక్షల 4732 రూపాయలు ఆదాయం వచ్చినట్లు ఈవో బి శ్రీనివాసరావు తెలిపారు. దేవాదాయ శాఖ ఇన్స్పెక్టర్ తనిఖీదారు జి.శ్యాంప్రసాద్ సమక్షమున తెరచి లెక్కించగా తే 24.02.2025 ది నుండి తే.05.03.2025 ది వరకు రూ. 14,47,302.00 లు ఆదాయం వచ్చినట్లు ఈవో తెలిపారు. కచ్చా బంగారం (000.001.000) ఒక గ్రాము మాత్రమే. వెండి (000.080.000) ఎనభై గ్రాముల మాత్రమే.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు , పోలీసు సిబ్బంది, అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొని యున్నారు.

కబ్జాకు కాదేదీ అనర్హం... నడిచే దారైనా... నీటి చెరువు అయినా...

విశాలాంధ్ర-పూసపాటిరేగ : కబ్జాకు కాదేదీ అనర్హం అన్నట్టుగా తయారైంది మండలంలో రియల్ ఏస్టేటర్ల పరిస్థితి.అది అందరూ నడిచే దారి ఐన లేక వ్యవసాయ చెరువైనా వాళ్లకు సంబంధం లేదు వాళ్లకు కావలసింది కబ్జా చేసుకోవట్టం లే అవుట్ లు వేసి అమ్ముకోవటం ఆ తరువాత ఆ స్థలం కొన్న వారు మోసపోవటం. స్థానిక యం.ఆర్.ఓ గోవింద రావు అందించిన వివరాల ప్రకారం స్థానిక తాసిల్దార్ ఆఫీస్ కి ఆనుకొని ఉన్న చెరువును కబ్జా చేసి, లేఅవుట్ వేసినట్లు ఆ లేఔట్ కు మార్గము నిమిత్తం చెరువు నిండిన తర్వాత నీరు ప్రవహించే అందుకు నిర్మించిన కల్వర్టును కప్పివేశారు విషయం తెలిసిన వెంటనే విఆర్ఓ రామకృష్ణను పంపించి విచారించగా సర్వే నంబర్ 127 లో రస్తా,చెరువు వాగు కలిపి ఏకర ఆరు సెంట్లు భూమిని సదును చేసి లే ఔట్ వేశారని నిర్ధారించారు.దానితో పాటు చెరువు నిండిన తర్వాత నీరు ప్రవహించడానికి నిర్మించిన కల్వర్టును కొంత భాగం కూలగొట్టి పక్కన లే అవుట్ కు రహదారి నిర్మించారు అని తెలిపి వెంటనే తగు చర్యలు తీసుకుంటామన్నారు.

ఈనెల 19న జరిగే ఛలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

మధ్యాహ్న భోజన పథకం రాష్ట్ర అధ్యక్షురాలు కె.స్రవంతి

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : మధ్యాహ్న భోజన పథకంలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కారం కోరుతూ ఈనెల 19న జరిగే చలో విజయవాడ ధర్నా చౌక్ వద్ద జరిగే మహా ధర్నాను విజయవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ మధ్యాహ్న భోజన పథకం (ఏఐటీయూసీ) రాష్ట్ర అధ్యక్షురాలు కే స్రవంతి అన్నారు. బుధవారం స్థానిక అమర్ భవన్ లో వీటికి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నో ఏళ్లగా అనేక ఇబ్బందులు పడుతూ కేవలం సేవా దృక్పథంతో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన పథక కార్మికులు ఎన్ని ప్రభుత్వాలు మారినా నేటికీ అన్యాయానికి గురి అవుతున్నారన్నారు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా విద్యార్థులకు మెనూ మార్చడం వల్ల కార్మికులపై అదనపు భారం పడుతుందన్నారు. వంటకు సరిపడా గ్యాస్ రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీపై ఉచితంగా సరఫరా చేయాలని, మధ్యాహ్న భోజన కార్మికులకు జీతం నెలకు పదివేల రూపాయలు ఇవ్వాలన్నారు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా కార్మికులను రాజకీయ వేధింపులకు గురౌతున్నారని కావున కార్మికులందరికీ ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ప్రభుత్వం రాగిజావ కు ప్రత్యేకంగా బడ్జెట్ కేటాయించాలని, కార్మికులందరికీ నాలుగవ తరగతి ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతన చట్టం అమలు చేయాలన్నారు. అనంతరం మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.సుబ్బారాయుడు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్ రంగరాజు, బుగత అశోక్ మాట్లాడుతూ ఎన్నో ఏళ్లగా పనిచేస్తున్న మధ్యాహ్న భోజన పథక కార్మికులకు పీఎఫ్ ఈఎస్ఐ ప్రమాద బీమా సౌకర్యం లేకపోవడం అన్యాయమన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే కార్మికులందరికీ న్యాయం చేస్తామని చెప్పి నేటికీ మధ్యాహ్న భోజన పథక కార్మికులకు ఎటువంటి న్యాయం చేయకపోవడం బాధాకరమన్నారు. కార్మికులు చేస్తున్న ఎటువంటి పోరాటకానికైనా ఏఐటీయూసీ అండగా ఉంటుందన్నారు ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు పురం అప్పారావు, పొడుగు రామకృష్ణ, పి.లక్ష్మీ, కె.రాజి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ భవనాలన్నింటికీ మౌలిక సదుపాయాలు ఉండాలి : కలెక్టర్

విశాలాంధ్ర-విజయనగరం కంటోన్మెంట్ : జిల్లాలో ఉన్నటువంటి అంగన్వాడీ భవనాల్లో మౌలిక వసతులు తప్పక ఉండాలని జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్ ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉండి టాయిలెట్ లేని , అదే విధంగా విద్యుత్ సరఫరా లేని భవనాల ఖచ్చితమైన జాబితాను వెంటనే అందించాలని ఆదేశించారు. వాటికి వెంటనే విద్యుత్, టాయిలెట్ సౌకర్యాలను ఏర్పాటు చేయాలనీ విద్యుత్, విద్యా శాఖల అధికారులకు ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో ఐ.సి.డి.ఎస్ శాఖ అధికారులతో బరువు తక్కువ ఉన్న పిల్లలు, బరువుకు తగ్గ ఎత్తు లేని వారి వివరాలపై, టీనేజ్ ప్రేగ్నన్సి తదితర అంశాల పై కలెక్టర్ సమీక్షించారు. ప్రతి నెల బరువులను నమోదు చేసేటప్పుడు ఖచ్చితమైన బరువులను నమోదు చేయాలనీ, అంచనాలను బట్టి వేయరాదని తప్పుడు సమాచారం ఇస్తే చర్యలు తప్పవని అన్నారు. ప్రతి అంగన్వాడీ కేంద్రాన్ని సూపర్వైజర్ తనిఖీ చేసి అంగన్వాడీ కార్యకర్త, ఆయా, ఆశ, ఏ.ఎన్.ఎం లను దగ్గర పెట్టుకొని ఖచ్చితమైన బరువులను, ఎత్తులను నమోదు చేయాలనీ , అందరి రిజిస్టర్లలో ఒకే సమాచారం ఉండాలని ఆదేశించారు. ఈకార్యక్రమం 15 రోజుల్లో పూర్తి కావాలని, ఆ తర్వాత తప్పులు కనపడితే సంబంధిత కార్యకర్త, సూపర్వైజర్‌పై చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో ఐ.సి.డి.ఎస్ ఇంచార్జ్ పి.డి ప్రసన్న, డి.ఎం.హెచ్.ఓ డా.జీవన రాణి, విద్యుత్‌శాఖ ఎస్.ఈ లక్ష్మణ రావు, డి .పి.ఓ వెంకటేశ్వర రావు, సీడీపీఓలు, సూపర్ వైజర్లు పాల్గొన్నారు.

స్మశానవాటిక పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి

విశాలాంధ్ర-బొబ్బిలి : పట్టణం పలు వార్డుల్లో స్మశాన వాటిక పనులు నిర్మాణానికి ప్రభుత్వం మంజూరు చేసిన 68 లక్షల రూపాయలతో జరుగుతున్న పనులను మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి పరిశీలన చేశారు. పనులు వేగవంతం చేయాలని, పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని మున్సిపల్ కమిషనర్ లాలం సిబ్బందిని ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మి క్షేత్రస్థాయి పరిశీలనలో భాగంగా డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్లు, శానిటరీ ఇన్స్పెక్టర్, పర్యావరణ ఇంజనీర్ వార్డురేషన్ ఎన్విరాన్మెంటల్ సెక్రటరీ మరియు ప్లానింగ్ అండ్ రెగ్యులేషన్స్ సెక్రటరీలతో మల్లమ్మపేట సచివాలయ పరిధిలో విస్తృతస్థాయి పర్యటన నిర్వహించారు. పట్టణ పరిధిలో గల ఐటిఐ కాలనీ, బాలాజీ నగర్, రాజా నగర్ కాలనీ మరియు మల్లంపేట స్మశాన వాటికలలో సుమారు 68 లక్షల అంచనా వ్యయంతో జరుగుతున్న ప్రహరీ గోడలు మరియు షెడ్ల నిర్మాణ పనులను పరిశీలించి పనులు యొక్క ప్రగతి నివేదికను డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వారి నుండి అడిగి తెలుసుకున్నారు. తదుపరి మల్లమ్మ పేటలో జరుగుతున్న పారిశుధ్య పనులను పరిశీలించి కాలువలలో సిల్ట్ పేరుకుపోయి ఉండటంతో ఆగ్రహించి ప్రతిరోజు సిల్ట్ తొలగించేలా చర్యలు తీసుకోవాలని శానిటరీ ఇన్స్పెక్టర్ వారికి ఆదేశించారు. శివాలయం వీధిలో అవుట్ఫాల్ డ్రైన్కు ఎక్స్టెన్షన్ త్రవ్వించాలని ఆదేశించారు. బొబ్బిలి నుండి మల్లమ్మ పేటకు వెళ్లే పైప్ లైన్ కు సంబంధించి ఇంజనీరింగ్ విభాగము మరియు టౌన్ ప్లానింగ్ విభాగం వారితో జాయింట్ ఇన్స్పెక్షన్ నిర్వహించి నివేదిక సమర్పించాల్సిందిగా ఆదేశించారు.

ఏపీ డీజీపీ హరీష్‌కుమార్‌ని కలిసిన ఎమ్మెల్యే బేబీ నాయన

విశాలాంధ్ర-బొబ్బిలి : ఏపీ డీజీపీ హరీష్ కుమార్ గుప్తాని ఎమ్మెల్యే ఆర్.వీ.ఎస్.కే.కే. రంగారావు (బేబీ నాయన) మర్యాద పూర్వకంగా కలిసి, తాను తీసిన వైల్డ్ లైఫ్ ఫోటోలతో చేసిన టేబుల్ క్యాలెండర్ అందజేసినట్లు తెలిపారు.

నీటి ఎద్దడి నివారణకు కంట్రోల్ రూమ్ ఏర్పాటు

విశాలాంధ్ర-నెల్లిమర్ల : ఈఏడాది ఎండలు, ఉష్ణోగ్రతలు అధికంగా ఉంటాయని భారత వాతావరణ శాఖ తెలపడంతో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమై ప్రతి మండలంలో అధికారులను గ్రామాల్లో నీటిఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. దీంతో మండల కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసారు. గ్రామ పంచాయతీలలో ఎక్కడైనా చేతి పంపులు పాడైపోయిన ఫోన్ 970118 5131కి కాల్ చేసి కంట్రోల్ రూమ్ అధికారి పి.సుధర్శనంకి తెలియజేయాలని కోరారు. మండలంలోని పాడైపోయిన బోర్లను రిపేర్ చేయడానికి అవసరమైనచోట నీరు అందించడానికి క్రాస్ ప్రోగ్రాం ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీవో కె.రామకృష్ణ రాజు తెలిపారు.

నేడు గీత కులాలకు కేటాయించిన మద్యం షాపులకు లాటరీ

విశాలాంధ్ర-రాజాం : రాజాం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో కల్లుగీతకులాలకు కేటాయించిన మద్యం షాపులకు ఈరోజు ఉదయం లాటరీ తీయడం జరుగుతుంది. దరఖాస్తు దారులు అందరూ గురువారం అనగా 06-3-2025న ఉదయం 09 గంటలకు విజయనగరం జిల్లా కలెక్టర్ వారి కార్యాలయంనందు ఆడిటోరయం వద్ద హాజరవ్వాలని ఎక్సైజ్ సీఐ జైభీమ్ తెలిపారు.

కాంట్రాక్టు వర్కర్లతో వెట్టి చాకిరీ చేయించుకోగలరా.... కార్మికులకు పెరిగిన జీతాలు, పిఎఫ్ డబ్బులు, ఈ.ఎస్.ఐ కార్డులు ఇప్పించలేరా...?

ఏఐటియుసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్ మండిపాటు

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : ప్రభుత్వ ఆసుపత్రిల్లో, వైద్య కళాశాలలో పనిచేస్తున్న శానిటేషన్, పెస్ట్ కంట్రోల్, సెక్యూరిటీ గార్డులు, సూపర్వైజర్ మొదలైన కాంట్రాక్టు వర్కర్లతో వెట్టి చాకిరీ చేయించుకుంటు, విపరీతమైన పనిభారం మోపి వేధిస్తున్న హాస్పిటల్స్ సూపరింటెండెంట్, ప్రిన్సిపల్, డిసిహెచ్ఎస్‌లు కాంట్రాక్టర్ల చేత పెరిగిన జీతాలు, పిఎఫ్ డబ్బులు, ఈ.ఎస్.ఐ కార్డులు ఎందుకు ఇప్పించలేకపోతున్నారని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్ మండిపడ్డారు.బుధవారం ఆంధ్రప్రదేశ్ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి అనుబంధం) ఆధ్వర్యంలో విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రి ముందు ధర్నా చేసి జిల్లా సూపరింటెండెంట్ కు వినతిపత్రం అందజేశారు. అనంతరం బుగత అశోక్ మాట్లాడుతూ హాస్పిటల్స్ లో ఉన్న పేషేంట్లకి ఇబ్బంది కలగకుండా, ప్రాణాలు లెక్కచేయకుండా పనులు చేస్తున్న శానిటేషన్, పెస్ట్ కంట్రోల్ వర్కర్లు, సెక్యూరిటీ గార్డులు, సూపర్వైజర్లు జీవితాలను రాష్ట్ర ప్రభుత్వం కాంట్రాక్ట్ దళారీ వ్యవస్థ చేతుల్లో పెట్టేసారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జీతాలు ఇవ్వనప్పుడల్లా రోడ్డెక్కి ధర్నాలు చేస్తేనే జీతాలు వేస్తారు లేకుంటే వారిని పండుగల్లో కూడా పస్తులు పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా ప్రభుత్వ సర్వజన, ఘోష, వైద్య కళాశాల, పి.హెచ్.సి, సి.హెచ్.సి, ఏరియా ఆసుపత్రలల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ పారిశుద్ధ్య, పెస్ట్ కంట్రోల్ వర్కర్లకు, సూపర్వైజర్లుకి ప్రభుత్వం జారీ చేసిన 549 జీవో ప్రకారం కాంట్రాక్ట్ వర్కర్స్ కి 16,000 సెక్యూరిటీ గార్డులకి జి.ఓ నెం. 43 ప్రకారం 12,688/- జీతాలు ప్రకటించిన ప్రభుత్వం వర్కర్స్ జీతభత్యాల విషయం తెలంగాణ రాష్ట్రంలో నల్లగొండ జిల్లాకు చెందిన టి.వి.టి గ్రూప్స్ అనే కాంట్రాక్టరుకి, భీమవరంలో ఉన్న స్కాట్ ల్యాండ్ గ్రూప్ కాంట్రాక్టరుకి గత ప్రభుత్వం అప్పగించి కమిషన్లకి ఆశపడి దళారీ వ్యవస్థను ప్రోత్సహించడం వలనే వైసిపి కి కార్మికులు తగిన గుణపాఠం చెప్పారని అన్నారు. ఇలా దళారీ చేతుల్లో పెట్టడం వలన పెరిగిన వేతనాలు ఇవ్వకుండా, ప్రతి నెలా సక్రమంగా జీతాలు చెల్లించకుండా వర్కర్స్ బ్రతుకులతో ఆడుకుంటున్నారని మండిపడ్డారు. శ్రమకి తగిన జీతం లేక, ప్రతి నెల జీతాలు అందకపోవడం వలన ధరల భారాలను తట్టుకోలేక అప్పులపాలు అయ్యి వడ్డీ వ్యాపారుల చేతుల్లో చిక్కి తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. కాంట్రాక్టరు మారిన తర్వాత సుమారు 45 మాసాలు నుంచి పిఎఫ్ ఎంత జమ అవుతుందో, ఈఎస్ఐ ఎంత కటింగ్ చేస్తున్నారో ఇంతవరకు పే స్లిప్పులు ద్వారా తెలియజేయకుండా నాటకాలాడుతూ తక్కువ వేతనాలు చూపిస్తూ దోపిడీకి పాల్పడుతున్నారని అన్నారు. హాస్పిటల్స్ వార్డులు పెరగిడం వలన ఆసుపత్రిలో సరిపడా వర్కర్స్ నియమించకుండా తక్కువ మంది వర్కర్స్‌తో వెట్టిచాకిరీ చేయించుకుని ప్రభుత్వం జారీ చేసిన జీవో 549 ప్రకారం జీతాలు ఇవ్వకుండా కాంట్రాక్టరు కార్మికులందర్నీ మోసం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. కరోనా సీజన్లో కూడా ఇల్లు, పిల్లల్ని వదిలి ప్రాణాలు పణంగా పెట్టి, కరోనా రోగులకు సేవ చేసి వర్కర్స్ అందరూ కరోనా బారిన పడిన వారిని కనీసం గత ప్రభుత్వం లో ఎవ్వరూ పట్టించుకోలేదు అని ఆవేదన వ్యక్తం చేశారు. టిడిపి కూటమి ప్రభుత్వ అధికారంలోకి వచ్చి 9 మాసాలు కవస్తున్న కూటమి హామీలు అమలు చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పాలకులు వెంటనే కలుగజేసుకొని ప్రభుత్వ ఆసుపత్రిల్లో, వైద్య కళాశాలలో పనిచేస్తున్న కార్మికులను పర్మినెంట్ చేసి ప్రతి నెలా జీతం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మికుల పై వేధింపులకు పాల్పడితే చూస్తూ ఊరుకోమని అన్నారు. పోరాటాలు మరింత బలోపేతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్సులు పురం అప్పారావు, దేగల అప్పలరాజు, ఆసుపత్రిల్లో, వైద్య కళాశాల పనిచేస్తున్న పారిశుధ్య, సెక్యూరిటీ, పెస్ట్ కంట్రోల్ వర్కర్స్, సూపర్వైజర్లు పాల్గొన్నారు.

ఏపీ పవర్ లిఫ్టింగ్‌లో ప్రతిభ కనబర్చిన ఎఎస్ఐ త్రినాధరావు

అభినందించిన జిల్లా ఎస్పీ వకుల్ జిందల్

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : విజయనగరం 1వ పట్టణ పోలీసు స్టేషన్లో ఎఎస్ఐగా పని చేస్తున్న అల్తి త్రినాధరావు ఇటీవల విశాఖపట్టణం సిటీ పెద గంట్యాడలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి డెడ్ లిఫ్ట్ & బెంచ్ ప్రెస్ వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్ షిప్ 2025 పోటీల్లో రెండు బంగారు పతకాలు సాధించారని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ మార్చి 5న తెలిపారు. బంగారు పతకాలు సాధించిన ఎఎస్ఐ ఆల్తి త్రినాధరావు జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ పోలీసు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలవగా, ప్రత్యేకంగా అభినందించి, ఇదే స్ఫూర్తిని భవిష్యత్తులో కూడా కొనసాగించి, జాతీయ స్థాయిలో మరిన్ని పతకాలు సాధించాలని అభిలషించారు. విశాఖపట్టణంలో జరిగిన రాష్ట్ర స్థాయి 4వ డెడ్ లిఫ్ట్ & 7వ బెంచ్ ప్రెస్ వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్ షిప్ 2025 పోటీల్లో వివిధ జిల్లాల నుండి జూనియర్, సీనియర్, మాస్టర్స్ విభాగాల్లో 200 మంది వరకు క్రీడాకారులు పాల్గొన్నారు. డెడ్ లిఫ్ట్ & బెంచ్ ప్రెస్ వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్ షిప్ 60 ఏళ్ల విభాగంలో విజయనగరం 1వ పట్టణ పోలీసు స్టేషన్లో పని చేస్తున్న ఎఎస్ఐ అల్లి త్రినాధరావు పాల్గొని బెంచ్ ప్రెస్లో 100 కిలోలు, డెడ్ లిఫ్ట్లో 135కిలోల బరువు ఎత్తి బంగారు పతకాలు సాధించారు. గతంలో కూడా మాస్టర్ అథ్లెటిక్స్ లో పాల్గొని ఎఎస్ఐ త్రినాధరావు చాలా పతకాలు సాధించారని కొనియాడారు. పలువురు పోలీసు అధికారులు, సిబ్బంది అభినందించి, శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో 1వ పట్టణ సిఐ ఎస్.శ్రీనివాస్, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి వేతనదారులకు గరిష్ట వేతనం రూ.300లు : డ్వామా పీడీ

విశాలాంధ్ర-రామభద్రాపురం : కొలతల ప్రకారం పనిచేసే ఉపాధి వేతనదారునికి గరిష్ఠ వేతనం రూ.300/-లు వచ్చేవిధంగా చూడాలని డ్వామా పిడి శారదాదేవి ఆదేశించారు. బుధవారంఆమెరామభద్రపురం మండలంలోని దుప్పలపూడి, ముచ్చెర్లవలస పంచాయితీలలో జరుగుతున్న పంటసంజీవిని(ఫార్మ్ పాండ్), రింగ్ ట్రెంచ్‌లు, గోశాలల పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఇంజినీరింగ్, సాంకేతిక సహాయకులు, బిఎఫ్‌టిలతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. క్షేత్రస్థాయిలో ఎక్కువ పని గంటలు పనిజరిగేలా చూడాలని, ఉదయం 6.00 గంటలకే పనులకు హాజరయ్యేలా చూడాలని కోరారు. ముందస్తుగా మార్కింగ్ చేసి పనులను సిద్ధం చేయాలని సూచించారు. ప్రస్తుతం జిల్లాలో సరాసరి వేతనం తక్కువుగా ఉందన్నారు. ముఖ్యంగా రామభద్రపురం, బాడంగి, తెర్లాం మండలాల ఉపాధి నందు గరిష్ఠ వేతనం రూ.300లు వచ్చేటట్లుగా పనులను నిర్వహించాలని చెప్పారు. ఈ మేరకు ఉపాధి సిబ్బంది మేట్లుకు, వేతనదార్లుకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఇదేవిధంగా కంపోస్టు పిట్స్, సోక్ పిట్స్ పనులను కూడా త్వరితగతిన పూర్తిచేయాలని చెప్పారు. లైవ్ ఆడిట్ మరియు సి.ఆర్.డి బృందాలు జిల్లాలో పర్యటిస్తున్నాయని, సమయపాలన పాటిస్తూ ఆ పని ప్రదేశంలో ఉండాలని సిబ్బందికి ఆదేశించారు. పని ప్రదేశంలో పనికి కావలిసిన పని ముట్లు, నీడ, నీరు వంటి సౌకర్యాలను ఉండెటట్లుగా సంబందిత మేటు, క్షేత్ర సహాయకులు చూడవలెనని సూచించారు. ఈ వారం లో 100% సోక్ పిట్స్‌ను పూర్తి చేయాలని, మంజూరు అయిన ఫారం పాండ్స్ అన్నింటినీ మొదలు పెట్టి, ఒక్కొక్క ఫారం పాండ్ కు 15 నుండి 20 మంది వేతనదార్లకు పనికల్పించవలెనని పిడి ఆదేశించారు.

పీఎం కిసాన్ ఈకేవైసీని రైతులు చేసుకోవాలి

విశాలాంధ్ర-బాడంగి : పిఎం కిసాన్ ఈకే వైసిను రైతులు విధిగా చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి శిరీష కోరారు. మండలం రేజర్ ఆనవరం గ్రామాల్లో మండల వ్యవసాయధికారి కే. శిరీష పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు .రైతులతో ప్రస్తుత పంటల పరిస్థితి గురించి అడిగి తెలుసు కున్నారు. వేసవి నువ్వులు సాగు చేస్తున్న రైతులకి నువ్వులు సాగు యాజమాన్యం తెలిపారు. ఫార్మర్ రిజిస్ట్రేషన్ అనేది భూమి కలిగి ఉన్న ప్రతి రైతు తప్పనిసరిగా చేసుకోవాలన్నారు. ఈ పంట నమోదు ఈకే వైసీ రేపటితో పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. మైక్రో ఇరిగేషన్‌లో నీరు తోడుకునే పైప్స్ కావాల్సిన వారు ఆర్ఎస్‌కె సిబ్బందిని సంప్రదించి రాయితీ మీద నల్ల పైపులు పొందాలని తెలియజేశారు. అనంతరం నువ్వులు పంట పరిశీలించి పూత సమయంలో నీటి ఎద్దడికి గురికాకుండా చూడాలని తెలిపారు. కార్యక్రమం ఎఇఓ మాధవిలత. విఎఎ వాడాడ సాయికుమార్, ప్రభ, రైతులు పాల్గొన్నారు.

భీమసింగిని తెరిచేందుకు చర్యలు తీసుకోండి : ఎమ్మెల్యే

విశాలాంధ్ర-జామి: ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాలలో ఎస్‌కోట ఎమ్మెల్యే కోళ్ళలలితకుమారి భీమసింగి సహకార చక్కెర కర్మాగారం గురించి ప్రభుత్వానికి విన్నవించారు. భీమసింగి సహకార చక్కెర కర్మాగారం మహారాజుల కాలంలనుంచి నడుస్తోందని, గత వైసీపీ ప్రభుత్వం ఆధునీకరణ పేరుతో కర్మాగారాన్ని మూసివేసిందని వివరించారు. కర్మాగారం మూతపడడంతో దాదాపు 16 మండలాలలో ఉన్న చెరుకు రైతులు, దాదాపు 250మంది కర్మాగారంలో పనిచేసి కార్మికులు ,ఇతర సిబ్బంది రోడ్డున పడ్డారన్నారు. వెంటనే ప్రభుత్వం చర్యలు తీసుకుని కర్మాగారంను తెరపించాలని, సిబ్బందికి, కార్మికులకు ఇవ్వాల్సిన బకాయిలను తక్షణమే చెల్లించేలా చూడాలని ఆమె కోరారు. భీమసింగి కర్మాగారం గురించి అసెంబ్లీలో ప్రస్తావించినందుకు కార్మికులు, సిబ్బంది ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

జామి జాతరకు సింహాచలం డిపో నుంచి ఆర్‌టిసి బస్సులు : జామిలో నేటినుంచి జరుగుతున్న శ్రీఎల్లారమ్మ జాతరకు సింహాచలం డిపో నుంచి 5 బస్సులను నడవనున్నట్లు ఎమ్మెల్యే కోళ్ళ లలితకుమారి తెలిపారు. ఈవిషయమై తాను డిపో మేనేజర్ రాజశేకర్‌తో ఫోన్‌లో మాట్లాడడం జరిగిందన్నారు. మూడు రోజులపాటు బస్సులను జామి నుంచి తిప్పేందుకువారు అంగీకరించారన్నారు. ఈసౌకర్యాన్ని ప్రజలు వినియోగించుకోవాలన్నారు.

అక్రమంగా తరలిస్తున్న 12 కేజీల గంజాయి పట్టివేత

విశాలాంధ్ర-శృంగవరపుకోట : పట్టణంలని రైల్వే చిల్డ్రన్స్ పార్క్ వద్ద 12 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్నామని ఎస్సై గంగరాజు తెలిపారు ఆయన తెలిపిన వివరాల ప్రకారం బుధవారం పట్టణంలోని రైల్వే స్టేషన్ చిల్డ్రన్ పార్క్ గేటు వద్ద ఒక వ్యక్తి గంజాయి కలిగి ఉన్నాడన్న సమాచారంతో వెళ్లి పరిశీలించగా ఒరిస్సా, కోరా పుట్ జిల్లా, బలడా గ్రామంకి చెందిన వ్యక్తి వద్ద అక్రమంగా 12 కేజీలు గంజాయి కలిగి ఉండడంతో అతన్ని పట్టుకుని అరెస్టు చేసి కోర్టు నందు హాజరు పరచడమైందని ఎస్సై తెలిపారు.

లారీ ప్రమాదంలో వృద్ధురాలు మృతి

విశాలాంధ్ర-చీపురుపల్లి : చీపురుపల్లి మండలం బైరెడ్డిపేట గ్రామంలో లారీ ప్రమాదంలో గాయపడిన బైరెడ్డి సూరమ్మ (64) అనే వృద్ధురాలు బుధవారం నాడు మృతి చెందింది. పోలీసుల కథనం మేరకు గ్రామంలో జొన్నలు లోడింగ్ చేయుటకు వెళ్లిన లారీ రివర్స్ గేరులో లారీను వెనక్కు తిప్పుచుండగా ప్రమాదవశాత్తు ఇంటి గోడను ఢీకొట్టింది. గోడకు అవతల వైపు నివాసముంటున్న బైరెడ్డి సూరమ్మ పైన గోడ పడిపోవడంతో వృద్ధురాలు తీవ్ర గాయాలు పాలయింది. ప్రధమ చికిత్సల కొరకు చీపురుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అత్యవసర చికిత్స నిమిత్తం విజయనగరం పంపించారు. అక్కడ చికిత్స పొందుతుండగా వృద్ధురాలు మృతి చెందినట్లు హెచ్ సి రమణ తెలిపారు. ప్రమాదములకు కారణమైన వారితోపాటు డ్రైవర్ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసామని ఆయన వివరించారు.

రైతు రిజిస్ట్రేషన్ ప్రక్రియ పనితీరును వ్యవసాయశాఖాధికారి పరిశీలన

విశాలాంధ్ర-గుర్ల : మండలంలో కెల్ల గ్రామం రైతు భరోసా కేంద్రం వద్ద రైతు రిజిస్ట్రేషన్ ప్రక్రియ పని తీరును జిల్లా వ్యవసాయశాఖ అధికారి వి. టీ. రామారావు బుధవారం పరిశీలించారు. ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని రైతులకు సూచించారు రాబోయే రోజుల్లో రైతులకు అవసరమైన ప్రభుత్వ పథకాలకు ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి అని ఆయన అన్నారు. ఖరీఫ్ సీజన్లో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన పెంచుకోవాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి తిరుపతిరావు, తదితరు పాల్గొన్నారు.

దువ్వాడపై దుమ్మెత్తిన జనసేన రాష్ట్ర ప్రచార కమిటీ కార్యదర్శి సురేష్‌బాబు

విశాలాంధ్ర-రాజాం : డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పై అసభ్యకరంగా అనుచిత వ్యాఖ్యలు చేసిన దువ్వాడ శ్రీనివాస్ పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని జనసేన రాష్ట్ర ప్రచార కమిటీ కార్యదర్శి, రాజాం నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ పొగిరి.సురేశ్ బాబు రాజాంలో బుధవారం విలేకరుల సమావేశంలో డిమాండ్ చేశారు. రాజకీయ నాయకులు ప్రజా సమస్యలపై మాట్లాడాలని, హుందాతనంగా ప్రవర్తించాలి. విలువలు లేని నీ ప్రవర్తన పవన్ కళ్యాణ్ ని ప్రశ్నించే అర్హత నీకు లేదని అన్నారు.దువ్వాడ శ్రీనివాస్ నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని హెచ్చరించారు. చట్టం తన పని తాను చేసుకుపోతుందని పోగిరి.సురేష్ బాబు అన్నారు. ఈ సమావేశంలో జనసేన పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంగా కులగణన చేపట్టాలి

ఎపి బీసీ ప్రజా వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు గూడూరి వెంకటేశ్వరరావు

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంగా కులగణన చేపట్టాలని ఎపి బీసీ ప్రజా వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు గూడూరి వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. మెజార్టీ ప్రజలు గా ఉన్న వెనక బడిన వర్గాలు అంటే బీసీలు సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో ఇప్పటికీ వెనకబడే ఉన్నారన్న సంగతి గమనించాలన్నారు. విజయనగరం ఎస్ కన్వెన్స్ టిఎస్ఆర్ గ్రాండ్ లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ భారతదేశానికి స్వాతంత్రం వచ్చి ఏడు దశాబ్దాలు దాటినా, 54 శాతం ఓటు బ్యాంకు కలిగిన వెనకబడిన తరగతుల ప్రజలు తాము ఎన్నుకుంటున్న రాజకీయ పార్టీల ద్వారా సామాజిక న్యాయం పాటించకపోవడం వల్ల నేటి పరిస్థితి కొనసాగుతూ వస్తుందని విచారం వ్యక్తం చేశారు. కనీస ప్రాథమిక హక్కులు కూడా పొందలేని స్థితిలో బీసీ వర్గాలు ఇంకా ఉన్నాయంటే పాలకులు సిగ్గుపడాల్సి ఉందన్నారు. కనీస విద్య, ఉపాధి, ఉద్యోగ రంగాల్లో బీసీలకు అందాల్సిన రిజర్వేషన్లు సమాన స్థాయిలో అందడం లేదన్నది అందరికీ తెలిసిందేనన్నారు. అందుకే ఎపి బీసీ ప్రజా వెల్ఫేర్ అసోసియేషన్ బీసీ వర్గాలను రాజకీయ చైతన్యం వైపు మళ్లించాలని దేశవ్యాప్తంగా పర్యటిస్తూ ఈరోజు విజయనగరం రావడం జరిగింది. కులాలుగా, కుల సంఘాలుగా బీసీలు విడిపోతున్నారని అందరూ ఒకే తాటిమీదకి వచ్చి బీసీ వేదికపై వచ్చి తమ ఉమ్మడి గళం వినిపించాలన్నదే ఎపి బీసీ ప్రజా వెల్ఫేర్ అసోసియేషన్ లక్ష్యంగా పేర్కొన్నారు.

జిల్లా ఎపి బీసీ ప్రజా వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షునిగా తాడ్డి శ్రీనివాసరావునాయుడు

జిల్లా ఎపి బీసీ ప్రజా వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షునిగా, ప్రముఖ సంఘ సేవకులు, పారిశ్రామిక వేత్త తాడ్డి శ్రీనివాసరావు నాయుడు అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు నియమిస్తున్నట్లు గూడూరు వేంకటేశ్వర రావు తెలియజేశారు. ఈ జిల్లాలో అన్ని నియోజకవర్గాల్లోనూ మండల స్థాయి గ్రామ స్థాయి వరకు వారి ద్వారా కమిటీలు నియామకం చేసి సంఘాన్ని బలోపేతం చేయడానికి నిర్ణయించామన్నారు. ఈసందర్భంగా విజయనగరం జిల్లాకు నూతనంగా బాధ్యతలు చేపట్టిన తాడ్డి శ్రీనివాసరావు మాట్లాడుతూ, బీసీల సమస్యల పట్ల పూర్తి అవగాహన ఉన్న గూడూరి వెంకటేశ్వరరావు నాయకత్వంలో విజయనగరం జిల్లాలో గ్రామస్థాయి వరకు బీసీలను చైతన్యం చేసే కార్యక్రమం చేపడతామన్నారు. ఈ సందర్భంగా వి.బీసీ ప్రజా వెల్ఫేర్ అసోసియేషన్ నేతలుగా పలువురిని నియామకాలు చేశారు. వారిలో జిల్లా ఉపాధ్యక్షులుగా ముల్లు పైడి నాయుడు, మరో ఉపాధ్యక్షుడిగా వల్లూరి గౌరీ నాయుడు, చీపురుపల్లి నియోజకవర్గ అధ్యక్షుడిగా పొట్నూరు నారాయణరావు లను నియమించారు.

జనసేన ఆవిర్భావ దినోత్సవ సభకు భారీగా తరలిరండి: పొగిరి సురేష్ బాబు

విశాలాంధ్ర-రాజాం : కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గం పరిధిలో ఉన్న చిత్రాడ గ్రామం వద్ద ఈ నెల 14 తేదిన జనసేన పార్టీ 12 వ ఆవిర్భావ దినోత్సవం కార్యక్రమానికి భారీ సంఖ్యలో ప్రజలు పాల్గొనాలని జనసేన పార్టీ సంయుక్త కార్యదర్శి, రాజాం నియోజకవర్గ ఇన్చార్జ్, 12వ ఆవిర్భావ దినోత్సవ సభకు కాకినాడ నియోజకవర్గం సమన్వయకర్త పొగిరి.సురేష్ బాబు పిలుపు నిచ్చారు. ఈ సందర్భంగా బుధవారం రాజాం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేఖర్లు సమావేశంలో సురేష్ బాబు మాట్లాడుతూ జనసేన పార్టీ ఆవిర్భవించి 11 సంవత్సరాలు పూర్తి చేసుకుని 12వ ఆవిర్భావ సభను నిర్వహించేందుకు జనసేన నాయకులు కార్యకర్తలు ఉత్సాహంతో ఉన్నారని ఈ ఆవిర్భావ దినోత్సవ సభకు రాష్ట్ర నలుమూలల నుండి పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొంటారని సురేష్ బాబు తెలిపారు. ఈ ఆవిర్భావ సభకు సంబంధించి అన్ని ఏర్పాట్లు ముమ్మారంగా చేస్తున్నట్లు తెలిపారు. జనసేన పార్టీ స్థాపించిన దగ్గర నుండి మా అధ్యక్షులు పవన్ కళ్యాణ్ నిరంతరము పార్టీ అభివృద్ధితో పాటు, ప్రజలు అభివృద్ధి కోసం, పేద ప్రజల సంక్షేమం కోసం నిరంతరం శ్రమిస్తున్న శ్రామికుడు మాపవన్ కళ్యాణ్ అని సురేష్ బాబు తెలిపారు. జనసేన పార్టీ ఒక సిద్ధాంతంతో పనిచేస్తుందని, ప్రజలకు మంచి చేయడమే మా పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ లక్ష్యమని తెలిపారు. బడుగు బలహీన వర్గాలు ప్రజలకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయడం కోసం జనసేన పార్టీ కృషి చేస్తుందని తెలిపారు. గత ప్రభుత్వం పవన్ కళ్యాణ్‌పై వ్యక్తిగత విమర్శలతోపాటు ఎన్ని ఇబ్బందులు పెట్టినా, లెక్కచేయకుండా వాటన్నింటినీ అధిగమించి జనసేన పార్టీని ప్రజల మనసులో స్థానం సంపాదించారని సురేష్ బాబు తెలిపారు. ఏ ప్రాంతంలోనైనా ప్రజలు విపత్కరమైన ఇబ్బందులు ఎదుర్కొన్న సమయంలో వారి కోసం తన సొంత డబ్బుని ఖర్చుపెట్టి వారి ఇబ్బందులను తీర్చిన వ్యక్తి మా పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ఒక్కరే అని తెలిపారు. రాజకీయంలో డబ్బు సంపాదన కోసమే ఎంతో మంది నాయకులు వస్తారని,మా జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ మాత్రం ప్రజల కోసం ప్రజాసంక్షేమ కోసం, నిరంతరం పనిచేస్తున్న నాయకుడని అన్నారు. అలాంటి నాయకుడు పార్టీ ఆవిర్భావ దినోత్సవం కార్యక్రమం ప్రజలు అందరు వచ్చి విజయవంతం చెయ్యాలని పొగిరి సురేష్ బాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజాం మండల జనసేన పార్టీ ఉపాధ్యక్షులు లెంక అన్నంనాయుడు, దబ్బాడ కృష్ణ, లెంక వెంకటరమణ, గార ఎర్రంనాయుడు, కె.వి.ప్రవీణ్, మీసాల శ్రావణ్, మీసాల రాంబాబు, బత్తుల హరి, శెట్టి ఆదినాయుడు, తుమ్మి మహేష్, బూరాడ.శ్రీనివాసరావు, టి.తిరుపతిరావు, మామిడి. రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా చేపట్టాలి

జిల్లా ఎస్పీ వకుల్ జిందల్

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : జిల్లా కేంద్రంలో మార్చి 8న చేపట్టే మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ మార్చి 5న ఆదేశించారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ మహిళా పోలీసు స్టేషన్ను సందర్శించి, పోలీసు స్టేషను ప్రాంగణం, గదులను, మహిళా దినోత్సవ ముగింపు వేడుక ఏర్పాట్లును పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవంను మార్చి 8న ఘనంగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర డిజిపి హరీష్ కుమార్ గుప్తా, ఐపిఎస్ గారి ఆదేశాల మేరకు మార్చి 1 నుండి 7 వరకు మహిళా సాధికారత వారోత్సవాలను జిల్లాలో నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా జిల్లా వ్యాప్తంగా వివిధ పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థినులకు లింగ వివక్షతపై చిత్ర లేఖనం పోటీలను మార్చి 5న నిర్వహించామన్నారు. జిల్లా కేంద్రంలోని మహిళా పోలీసు స్టేషను వద్ద మార్చి 8న నిర్వహించనున్న మహిళా దినోత్సవ ర్యాలీలో పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొనే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ముగింపు వేడుకల్లో వక్తృత్వ, వ్యాస రచన, చిత్ర లేఖనం పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థినులకు సర్టిఫికేట్స్, బహుమతులను ప్రధానం చేయనున్నామని తెలిపారు. జిల్లా ఎస్పీ వెంట అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, డిఎస్పీ ఎం.శ్రీనివాసరావు, మహిళా పిఎస్ ఇన్స్పెక్టరు ఈ.నర్సింహమూర్తి, ఎస్బీ సిఐలు ఎ.వి.లీలారావు, ఆర్.వి.ఆర్.కే.చౌదరి, ఎస్ఐ నర్సింగరావు మరియు ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది ఉన్నారు.

అవంతీస్ సెయింట్ థెరిస్సా ఇంజినీరింగ్ కాలేజీలో

ఘనంగా జాతీయస్థాయి సాంకేతిక ఉత్సవ ప్రారంభ వేడుకలు

విశాలాంధ్ర-గరివిడి : స్థానిక గరివిడి అవంతీస్ సెయింట్ థెరిస్సా ఇంజనీరింగ్ కాలేజీలో బుధవారం ఉదయం "ఆటోస్-2కె25" పేరుతో అవంతి విద్యా సంస్థల చైర్మన్ శ్రీ ముత్తంశెట్టి శ్రీనివాసరావు గారు అధ్యక్షతన జాతీయస్థాయి సాంకేతిక ఉత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డాక్టర్ కె.చంద్రభూషణరావు ఈసీఈ విభాగం,డీఏపీ జేఎన్టీయూ గురజాడ, విజయనగరం నుండి విచ్చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు ఈ నాలుగేళ్లలో ఉన్న కాలాన్ని సద్వినియోగం చేసుకొని సాంకేతిక నైపుణ్యతపై దృష్టిపెట్టాలని కోరారు. అలాగే విద్యార్థుల విద్యతోపాటు యోగ,ఫిజికల్ వ్యాయామం ద్వారా శారీరిక దృఢత్వాన్ని కూడా పెంపొందించుకోవాలని కోరారు.సుందర్ పిచాయ్ సత్య నాదెళ్ల వంటి సాంకేతిక నిపుణులను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని కోరారు.గౌరవ అతిథిగా డాక్టర్ ఎమ్.పీ చక్రవర్తి ప్రొడక్షన్ మేనేజర్,షిప్ యార్డ్ ప్రైవేట్ లిమిటెడ్ విశాఖపట్నం నుండి విచ్చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అధునాతన సాంకేతికతను అందిపుచ్చుకుంటూ విన్నూత ఆవిష్కరణలు చేయాలని కోరారు. విద్యార్థులు సృజనాత్మకతతో ఉద్యోగ,ఉపాధికి అవసరమైన నైపుణ్యాలను పెంపొందించుకొని అత్యున్నత స్థాయికి చేరుకోవాలని తెలిపారు. మరొక గౌరవ అతిథిగా జె.కుమార్ డైరెక్టర్ హెచ్.ఆర్ ఏషియన్ ఇన్ఫోటెక్ ప్రైవేట్ లిమిటెడ్,విశాఖపట్నం నుండి విచ్చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల్లో ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని వెలికితీయడానికి ఇటువంటి సాంకేతిక ఉత్సవాలు ఎంతో దోహదం చేస్తాయని తెలిపారు. విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాన్ని అలవర్చుకుని పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. మరొక అతిథిగా డాక్టర్ కె.నాగసుమన్ ప్రొఫెసర్ మెకానికల్ విభాగం,ఆంధ్ర యూనివర్సిటీ విశాఖపట్నం నుండి విచ్చేసారు. ఈసందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు కాలంతోపాటు సాంకేతిక నైపుణ్యత పై అవగాహన పెంచుకోవాలని తెలిపారు. మరొక అతిథిగా డాక్టర్ కె.శ్రీకుమార్ ప్రొఫెసర్ ఎలక్ట్రికల్ విభాగం జేఎన్టీయూ గురజాడ,విజయనగరం నుండి విచ్చేశారు ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు అకాడమిక్ స్కిల్స్ తో పాటు టెక్నికల్ స్కిల్స్ ను కూడా నేర్చుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర మాజీ మంత్రివర్యులు అవంతి విద్యాసంస్థల చైర్మన్ ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, మిషన్ లెర్నింగ్, పైథాన్, జావా వంటి సాంకేతికత కన్నా మనిషి మేధస్సు ఎంతో గొప్పదని తెలియజేసారు. అలాగే ప్రతి విద్యార్థి సరైన లక్ష్యాన్ని నిర్దేశించుకుని పాజిటివ్ అటిట్యూడ్, క్రమశిక్షణ, హార్డ్ వర్క్ అలవర్చుకుని వాటిని సాధించుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ వి.జాషువా జయప్రసాద్ గారు మాట్లాడుతూ విద్యార్థులు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్, పోస్టర్ ప్రెజెంటేషన్, ప్రాజెక్ట్ ఎక్స్పో మరియు హేకథాన్ వంటి సాంకేతిక పద్ధతుల ద్వారా విద్యార్థుల వారి యొక్క సాంకేతిక సామర్థ్యాన్ని ప్రదర్శించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అవంతి విద్యాసంస్థల ప్రతినిధి ఎమ్.మహేష్, వైస్ ప్రిన్సిపల్ బి.వెంకటరమణ, ఏఓ జి.అనిల్‌కుమార్, వివిధ విభాగాధిపతులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు బోధనేతర సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ సతిమణికి బొబ్బిలి మాజీ ఎమ్మెల్యే శ్రద్ధాంజలి

విశాలాంధ్ర-తెర్లాం : మండలం కునాయవలస గ్రామానికి చెందిన వైసీపీ సీనియర్ నాయకులు,మాజీ సర్పంచ్ కర్రీ రామినాయుడు సతిమణి కర్రీ సూరమ్మ గత కొన్ని రోజుల క్రితం అకాల మరణం చెందారు. ఈ సందర్భంగా బుధవారం గ్రామంలో ఆమె పెద్దకర్మ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమనికి బొబ్బిలి మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు హాజరై ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట సర్పంచ్ బోడెల విజయబాబు, మాజీ ఎఎంసి చైర్మన్ బొమ్మి శ్రీనివాసరావు, మాజీ ఎంపీటీసీ కర్రీ సత్యనారాయణ, తదితరులు హాజరయ్యారు.

టిడిపి నాయకులకే సంక్షేమ పథకాలు : మాజీ ఎమ్మెల్యే సంబంగి

విశాలాంధ్ర-రామభద్రపురం : తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి రావడానికి ఎన్నికల ముందు చంద్రబాబునాయుడు అనేక మోసపూరిత హామీలు ఇచ్చారని బొబ్బిలి మాజీ ఎమ్మెల్యే వెంకట చినప్పల నాయుడుఅన్నారు. బుధవారం స్థానిక వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పడి తొమ్మిది నెలల కావస్తున్నప్పటికీ ఏ ఒక్క సంక్షేమ పథకం ప్రజలకు చంద్రబాబు నాయుడు అమలు చేయలేదని అన్నారు. సూపర్ సిక్స్ పేరుతో ఎన్నికలలో ప్రజలను మభ్యపెట్టి ఓట్లు వేయించుకొని అధికారంలోకి వచ్చిన తర్వాత పథకాలు అమలు చేయడంలో ఘోరంగా విఫలము చెందారని ఎద్దేవా చేశారు. గత వైఎస్ఆర్ ప్రభుత్వంలో ప్రజలు సుఖసంతోషాలతో ఉండేవారిని ప్రతినెల ఏదో ఒక పదము జగన్మోహన్ రెడ్డి లబ్ధిదారుల ఖాతాలో జమ చేసే వారిని గుర్తు చేశారు. ప్రజలు నుమోసం చేయడంలో చంద్రబాబు నాయుడు ముందు అందులో ఉంటారని అన్నారు. అభివృద్ధి పేరుతో గ్రామంలో ఒకరిద్దరు టిడిపినాయకులు తప్ప మరే ఒక్కరికి తెలుగుదేశం ప్రభుత్వం ఉపయోగపడటం లేదని అన్నారు. ఇప్పటికే గ్రామాలలో తెలుగుదేశం ప్రభుత్వం ను ప్రజలు అసహ్యించుకుంటున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు చోక్కాపు లక్ష్మణరావు జేసీసీ కన్వీనర్ సింహాసనం నాయుడు, మండల యూత్ నాయకులు వ్యాకనాదం, వైసీపీ నాయకులు పైడిరాజు కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్లు అనుసంధానం చేయండి

విశాలాంధ్ర-విజయనగరం ఫోర్ట్ : భోగాపురం విమానాశ్రయం అభివృద్ధికి సరైన రోడ్డు అనుసంధానం అవసరమని బుధవారం శాసనసభలో విజయనగరం శాసనసభ్యురాలు పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు కోరడం జరిగింది. ఈసందర్భంగా శాసన సభ సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఉత్తరాంధ్ర ప్రజల ఆర్థికాభివృద్ధికి భోగాపురం ఎయిర్ పోర్ట్ కీలకంగా మారుతుందని, ప్రత్యేకంగా విజయనగరం, మన్యం జిల్లాల్లోని రైతులు తమ పంటలు, చేతివృత్తుల ఉత్పత్తులను ఎగుమతి చేసుకునే అవకాశాన్ని కార్గో సేవలు కల్పిస్తాయని, ఈ సేవలు సమర్థవంతంగా అందుబాటులో ఉండాలంటే మెరుగైన రహదారి మార్గం అవసరమన్నారు. విజయనగరం నియోజకవర్గంలోని ఐస్ ఫ్యాక్టరీ, అయినాడ, ముక్కాం, రహదారి భోగాపురం ఎయిర్ పోర్ట్ అనుసంధానానికి ఎంతో ఉపయోగపడుతుందని ప్రస్తావించారు. తెలుగుదేశం ప్రభుత్వం 2017-18లో రహదారి విస్తరణ కోసం నిధులు మంజూరు చేసినా, గత వైసిపి ప్రభుత్వం ఈ పనులను రద్దు చేయడం వలన అభివృద్ధికి నోచుకోలేదు. కాబట్టి, ఈరహదారి అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రహదారుల అభివృద్ధి ద్వారా భోగాపురం విమానాశ్రయం పూర్తిస్థాయిలో ఉపయోగపడుతుందని, ముఖ్యంగా మన రైతులు తమ ఉత్పత్తులను కార్గో సేవల ద్వారా దేశ విదేశాలకు ఎగుమతి చేసి అభివృద్ధి సాధించగలరని గట్టిగా విశ్వసిస్తున్నారు.

జే.యన్.టి.యు. గురజాడలో మెరుగైన ఆరోగ్యం కోసం అవగాహనా సదస్సు

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: జేయన్‌టియు గురజాడ విశ్వ విద్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవంను పురస్కరించుకుని మహిళా సాధికారత, ఫిర్యాదుల విభాగం అధ్వర్యంలో మహిళల ఆరోగ్యంపై అవగాహనా కార్యక్రమం నిర్వహించి అనంతరం "వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ప్రభుత్వ వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపల్ హెచ్ఓ డిడాక్టర్. దేవి మాధవి మహిళలు ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఆహారపు అలవాట్లను గురుంచి వివరంగా తెలియజేశారు. డాక్టర్ భార్గవి, ప్రభుత్వ వైద్య కళాశాల, విజయనగరం వైద్యులు డాక్టర్ ఎస్.లక్ష్మి, అసిస్టెంట్ ప్రొఫెసర్, సైకాలజీ డాక్టర్. ఝాన్సీ, ప్రొఫెసర్ ఆఫ్ ఎస్ పి ఎండాక్టర్. భార్గవి, ప్రొఫెసర్ ఇన్ గైనకాలజీ వారి ఇంటర్న్స్ పాల్గొని విద్యార్థులను, మహిళా ఉద్యోగినులను పరిశీలించారు. యూనివర్సిటీ ఇన్‌చార్జ్ వైస్-ఛాన్సలర్ ప్రొఫెసర్. డి.రాజ్యలక్ష్మి మాట్లాడుతు విద్యార్థినులు, మహిళ అధ్యాపకులు ఇటువంటి కార్యక్రమానికీ హాజరు అగుటవలన వారిలో ఆరోగ్యం పట్ల చక్కని అవగాహన ఏర్పడుతుందన్నారు. ప్రతీఒక్కరు వారి తల్లి చేసే ప్రోత్సాహాన్ని గుర్తించాలన్నారు. యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య జి.జయసుమ మాట్లాడుతూ, ప్రతీ మహిళ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. మహిళలు వారి ఆరోగ్య సమస్యలపై సత్వరమే స్పందించి, సంపూర్ణ ఆరోగ్యవంతులుగా వుండాలని ఆకాంక్షించారు. మహిళా సాధికారత, ఫిర్యాదుల విభాగం సమన్వయకర్త డాక్టర్. బి.నళిని విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను తీర్చిదిద్దే గురుతర బాధ్యత ఉపాధ్యాలదే

విశాలాంధ్ర-చీపురుపల్లి : సమాజానికి దిశదశలకు ఉత్తమ పౌరులుగా విద్యార్థులను తీర్చిదిద్దే గురుతర బాధ్యత ఉపాధ్యాలదేనని రిటైర్డ్ జడ్. పి. పరిషద్ విద్యాధికారి కె.ఆనందసాగర్ అన్నారు. చీపురుపల్లి బాలుర ఉన్నత పాఠశాలలో 1965-1969 వరకు ఎస్.ఎస్.ఎల్.సి. పూర్తి చేసిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం బుధవారం హై స్కూల్ ఆవరణలో జరిగిన సభకు హైస్కూల్ హెచ్. ఎమ్. కె చంద్ర శేఖర కుమార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆందసాగర్ మాట్లాడుతూ అరవై ఏళ్ళ కిందట స్కూల్ విడిచిన పూర్వ విద్యార్థులు సమావేశమై సన్మానించడం విశేషమని అందులో పలువురు ఉపాధ్యాయులు వారి ఉపాధ్యాన్ని గౌరవించిన తీరు సమాజానికి మార్గదరకం అవురున్నారు. పురాతన ఉన్నత పాఠశాల ఎందరికో అత్యున్నత స్థానాలు పొందడానికి దోహదపడిందని అందుకు వారు ఈ పాఠశాల అభివృద్ధికి సహకరించాలని హెచ్. ఎమ్ చంద్రశేఖర్ కోరారు. ఈ సభలో ఎ.యు. ప్రొఫెసర్ ఎమ్ సూరప్పుడు, రిటైర్డ్ గ్రామీణ బ్యాంకు అధికారి యు. రాంబాబు, పి.మోహనరావు, డీలర్ల సంఘ నాయకుడు సూరు చిట్టి కృష్ణ, బిజెపి పార్టీ మండల అధ్యక్షుడు ఇప్పిలి నీలకంఠం తదితరులు పాల్గొన్నారు. సమ్మేళనం కన్వీనర్ జాతీయస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఎమ్.వి.ఎస్.ఎన్. రాజు మాట్లాడారు. అంతకముందు పాఠశాలలో గల సరస్వతీ విగ్రహానికి అందరూ పూలామాలలు వేశారు.

పాఠశాలల కిచెన్ గార్డెన్ అభివృద్ధికి నిధులు మంజూరు

ఎంపీడీఓ సి.హెచ్. సూర్యనారాయణ

విశాలాంధ్ర-వేపాడ : మండలంలోని అన్ని పాఠశాలల కిచెన్ గార్డెన్ల అభివృద్ధికి నిధులు మంజూరు చేయడం జరిగిందని మండల పరిషత్ అభివృద్ధి అధికారి సి.హెచ్ సూర్యనారాయణ అన్నారు. బుధవారం మండల కేంద్రమైన వేపాడ విద్య వనరుల కేంద్రంలో మండలంలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో మండల విద్యాశాఖ అధికారులు ఎన్. నాగభూషణరావు పి.బాల భాస్కరరావుల అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైనారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో గల కిచెన్ గార్డెన్ అభివృద్ధి పనుల నిమిత్తం ప్రతి పాఠశాలకు ప్రభుత్వం రూ. 5వేల రూపాయలు మంజూరు చేసిందన్నారు. అలాగే మండలంలోని 35పాఠశాలలు ఉన్నాయన్నారు. ఈ కిచెన్ గార్డెన్ అభివృద్ధి పనులు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు అభివృద్ధి చేయాలని, పాఠశాలల నుండి వచ్చే తడి పొడి చెత్తలను వేరుచేసి కంపోస్ట్ ఎరువుగా తయారుచేసి కిచెన్ గార్డెన్లకు ఎరువులుగా వినియోగించాలని సూచించారు. అలాగే ఆకుకూరలతోపాటు కూరగాయలు పండ్ల మొక్కలను కూడా పెంచాలన్నారు. అనంతరం 35 పాఠశాలల ఆయాలతో సమావేశం ఏర్పాటుచేసి కిచెన్ గార్డెన్ ఏవిధంగా అభివృద్ధి చేయాలన్నది వివరించారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సిఆర్పిలు తదితరులు పాల్గొన్నారు.

భూముల రీసర్వేను రైతులు సద్వినియోగం చేసుకోండి

తహసీల్దారు జే.రాములమ్మ

విశాలాంధ్ర-వేపాడ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న భూముల రీ-సర్వేను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తాసిల్దార్ జె.రాములమ్మ అన్నారు. మండలంలోని రామస్వామి పేటలో బుధవారం గ్రామ రెవెన్యూ సంబంధించి భూముల రీ సర్వే సమావేశం రైతులతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలమేరకు భూముల రీ-సర్వే మరల ప్రారంభించడం జరుగుతుందని అందులో భాగంగా రామస్వామిపేట గ్రామాన్ని రీ-సర్వే చేయుటకు ఎంపిక చేయడం జరిగిందన్నారు. అలాగే మండల అధికారులు రీ సర్వే చేసిన సమయంలో రైతులు వారి భూముల దగ్గర ఉండి వారికి గల హక్కు పత్రాలను చూపించాలని సూచించారు. అలాగే ఈ రీసర్వేకి భూములున్న రైతులందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలోడిప్యూటీ తహసిల్దారు కే.సన్యాసినాయుడు, వీఆర్వో, వీఆర్ఏ, సచివాలయ సర్వేయర్లు, గ్రామ సర్పంచ్ శర్మ,మాజీ సర్పంచ్ గొలగాని కృష్ణమూర్తి, గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల ప్రగతిపై ఎంపిడిఓ శ్రీనివాసరావు సమీక్ష

విశాలాంధ్ర-రాజాం : మార్చి నెలాఖరులోగా ప్రతీ ఉద్యోగి తప్పనిసరిగా లక్ష్యాలు సాధించాలని ఎపిడిఓ వావిలపల్లి. శ్రీనివాసరావు ఉపాధి పథకం సిబ్బందిని ఆదేశించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించి, ప్రగతిపై సమీక్ష జరిపారు. ప్రతీ గ్రామ పంచాయతీలో మార్చి నెలాఖరులోగా తప్పనిసరిగా 5 ఫారంపాండ్స్ నిర్మాణం జరగాలని పనుల్లోకి వస్తున్న వేతనదారులకు రోజుకు రూ.300 వేతనం రావాలని పనుల్లో నాణ్యత లోపించడానికి వీల్లేదని విధిగా రెండుపూటలా మస్టర్లు జరగాలని వ్యవసాయ ఉద్యానవన సంబంధిత పనులకు అంచనాలు తయారు చేయాలని ప్రగతి సాధించడంలో అలసత్వం వహించడానికి వీల్లేదని ఎంపిడిఓ సిబ్బందికి దిశా నిర్దేశం చేసారు. అలసత్వం వహిస్తే మాత్రం చర్యలు తప్పవని స్పష్టం చేసారు. సమావేశంలో ఎపిఓ సాయిరామ్ పాల్గొన్నారు.

పాఠశాల సమగ్ర అభివృద్ధి ప్రణాళిక తయారీకే సామాజిక తనిఖీ

విశాలాంధ్ర-మెరకముడిదాం : మండలంలో పలు పాఠశాలలో కాంప్లెక్స్ పరిధిలో ఈ సామాజిక తనిఖీలు నిర్వహిస్తున్నారు. బిల్లలవలస కాంప్లెక్స్ పరిధిలో మంగళవారం కొత్త కర్ర మరియు కొర్లాం ప్రాథమిక పాఠశాలలో ఈ సోషల్ ఆడిట్ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా డొక్కా సీతమ్మ మధ్యాహ్నం భోజన పథకం అమలు తీరు, పాఠశాల భౌతిక మరియు మౌలిక వసతుల కల్పనపై సామాజిక తనిఖీ నిర్వహించడం జరిగింది. అదేవిధంగా పాఠశాల నిధులు విడుదల, వినియోగం ఖర్చులు వంటి వాటిపై సామాజిక తనిఖీ నిర్వహించారు. ఈ సామాజిక తనిఖీలో సిఆర్ఎంటి రెడ్డి శంకర్రావు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

6వ వార్డులలో బీసీ కార్పొరేషన్ లోన్లుపై అవగాహన సదస్సు

విశాలాంధ్ర-రాజాం : భారతీయ జనతా పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు,సారధి నీటి సంఘం సభ్యులు మిత్తిరెడ్డి మధుసూదనరావు ఆధ్వర్యంలో రాజాం పురపాలక సంఘ పరిధి 6వ వార్డ్ సారథి లో సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ టంకాల దుర్గారావు, నాలుగు మండలాల సీనియర్ నాయకులు హాజరుకావడం జరిగింది. ఈ కార్యక్రమంలో దుర్గారావు మాట్లాడుతూ "బీసీ కార్పొరేషన్ లోన్లు పట్ల అవగాహన కల్పించడం జరిగింది" మరియు పార్టీని సంస్థాగతగా బలోపేతానికి కృషి చేయాలి అన్నారు, అనంతరం నాలుగు మండలాల సీనియర్ నాయకులు దుర్గారావుకి సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు బురడ అప్పలనాయుడు, ఉత్తరావల్లి మోహన్రావు, పాలవలస సింహాచలం, వియ్యపు లక్ష్మి నాయుడు, ఆర్.నీలయ్య, పేరూరి శ్రీనివాసరావు, ఎం.సూరిబాబు, వి.పోలినాయుడు, జి.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలు

విశాలాంధ్ర-బొబ్బిలి : మార్చి ఒకటి నుంచి 8 వరకు ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారిణి జాగానా విజయలక్ష్మి ఆధ్వర్యంలో జరుగుతున్న అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలు 5వ రోజు మండలం కోమటి పల్లి గ్రామంలో అంగన్వాడి కేంద్రాల కార్యకర్తలు రెడ్డి ఈశ్వరమ్మ, వాకాడ ఇందిరా, వెలమల మంగమ్మ తదితరులు ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా అంగన్వాడి కేంద్రాల్లో చిన్నారులకు అన్నప్రాసన,గర్భిణీలకు శ్రీమంతాలు, యోగా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమానికి అంగన్వాడి కేంద్రాలు తల్లుల నుండి విశేష స్పందన లభించింది.

బొబ్బిలి: ఈనెల ఒకటి నుండి 8 వరకు

మహిళా దినోత్సవం సందర్భంగా జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు, మహిళా సాధికారత వారోత్సవాలలో భాగంగా పట్టణం అభ్యుదయ విద్యాసంస్థలో డీఎస్పీ భవ్య రెడ్డి, పట్టణ సిఐ సతీష్ కుమార్‌ల ఆధ్వర్యంలో విద్యార్థులకు పెయింటింగ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ భవ్య రెడ్డి బాల బాలికలంతా విలువలతో కూడిన నాణ్యమైన విద్యపై దృష్టి సారించాలని ఉన్నత చదువులు చదివి సమాజానికి కుటుంబానికి మంచి పేరు తీసుకురావాలని పిలుపునిచ్చారు. పెళ్లి వద్దు చదివే ముద్దని, బాలికల విద్య చేయూతను అందించాలని కోరారు.

సమగ్రశిక్ష ఉద్యోగులుకు హెచ్ఆర్ పాలసీ, గ్రాట్యుటీ అమలుచేయాలి : ఎమ్మార్సీ ఉద్యోగులు

విశాలాంధ్ర-నెల్లిమర్ల : ఎమ్మార్సీ కార్యాలయంలో పనిచేస్తున్న సమగ్రశిక్ష ఉద్యోగులుకు హెచ్ ఆర్ పాలసీ, గ్రాట్యుటీ అమలు చేయాలని బుధవారం నెల్లిమర్ల ఎమ్మార్సీ కార్యాలయంలో పనిచేస్తున్న సమగ్రశిక్ష ఉద్యోగులు ఆందోళన చేపట్టారు. తమకు కూడా హెచ్ ఆర్ పాలసీ, గ్రాట్యుటీ అమలు చేయాలని, ఉద్యోగ విరమణ వయసు 62 సంవత్సరాలకు పెంచాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు అకౌంటెంట్ రామకృష్ణ, ఆపరేటర్ భారతి, ఐఈఅర్టీలు అప్పలనాయుడు, పురుషోత్తమ నాయుడు, మెసెంజర్ గోవిందమ్మ పాల్గొన్నారు.

6వ వార్డులలో బీసీ కార్పొరేషన్ లోన్లుపై అవగాహన సదస్సు

విశాలాంధ్ర-రాజాం : భారతీయ జనతా పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు, సారథి నీటీ సంఘం సభ్యులు మిత్తిరెడ్డి మధుసూదనరావు ఆధ్వర్యంలో రాజాం పురపాలక సంఘ పరిధి 6వ వార్డ్ సారథి లో సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ టంకాల దుర్గారావు, నాలుగు మండలాల సీనియర్ నాయకులు హాజరు కావడం జరిగింది. ఈ కార్యక్రమంలో దుర్గారావు మాట్లాడుతూ 'బీసీ కార్పొరేషన్ లోన్లు పట్ల అవగాహన కల్పించడం జరిగింది'. పార్టీని సంస్థాగతగా బలోపేతానికి కృషి చేయాలి అన్నారు, అనంతరం నాలుగు మండలాల సీనియర్ నాయకులు దుర్గారావుకి సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు బురడ అప్పలనాయుడు, ఉత్తరావల్లి మోహన్రావు, పాలవలస సింహాచలం, వియ్యపు.లక్ష్మి నాయుడు, ఆర్.నీలయ్య, పేరూరి శ్రీనివాసరావు, ఎం.సూరి బాబు, వి.పోలినాయుడు, జి.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవ పోస్టర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర-రాజాం : ఈనెల 14వ తేదీన కాకినాడ జిల్లా చిత్రాడ ప్రాంతంలో జరిగే జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవం పోస్టర్ ను జనసేన రాష్ట్ర ప్రచార కమిటీ కార్యదర్శి, రాజాం నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జ్ పొగిరి సురేష్ బాబు జనసేన పార్టీ నాయకులు కార్యకర్త లతో కలిసి ఆవిర్భావ దినోత్సవ పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సురేష్ బాబు మీడియాతో మాట్లాడుతూ ఈ ఆవిర్భావ దినోత్స వానికి జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అందరూ హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేస్తారని కోరుకుంటున్నామని ఆయన తెలిపారు. ఈకార్యక్రమంలో జన సైనికులు అందరూ పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే సతీమణి పొట్నూరు కనకమ్మ మృతి

విశాలాంధ్ర-గుర్ల : దివంగత మాజీ ఎమ్మెల్యే పొట్నూరు సూర్యనారాయణ సతీమణి పొట్నూరు కనకమ్మ బుధవారం మృతి చెందారు. మండలంలో ఎంపీపీ పొట్నూరు ప్రమీల అత్తగారు, జిల్లా వైసీపీ పార్టీ కార్యవర్గ సభ్యులు పొట్నూరు సన్యాసినాయుడు తల్లి అయిన పొట్నూరు కనకమ్మ సర్పంచ్ అకాల మరణంతో ఎంపిపి కుటుంబంలో విషాదఛాయలు అలుము కున్నాయి. ప్రస్తుత ఆమె పాలవలస గ్రామం సర్పంచ్‌గా కొనసాగు తున్నారు. బుధవారం ఆమే ఇంటి వద్ద ఉంటుం డగానే అపస్మారస్థితికి గురయ్యారు.సపర్యలు చేసినప్పటికీ ఆమె అప్పటికే మృతి చెందారని కుటుంబ సభ్యులు తెలిపారు. కనకమ్మ మృతితో గ్రామంలో మండలంలో విషాదఛాయలు అలుముకున్నాయి.ఆమె మృతికి మండల ముఖ్య నేతలు గ్రామ పెద్దలు పెద్దలు, వివిధ గ్రామాల నేతలు కార్యకర్తలు ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు.

మహిళా ఉద్యోగులకు 5 రోజుల అదనపు సెలవులు

విశాలాంధ్ర-భోగాపురం : వైద్యశాఖలోని మహిళా ఉద్యోగులకు 5 రోజులు ప్రత్యేక సెలవలు పెంచుతూ మంగళవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంపై భోగాపురం ఏ.పి.ఎన్.జి.ఓ. భోగాపురం తాలూకా అధ్యక్షులు. కొమ్మూరు దుర్గారావు, మహిళా కార్యదర్శి పి. కృష్ణవేణి ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.. ప్రస్తుతం వైద్య శాఖలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు,కాంట్రాక్టు మహిళా ఉద్యోగులకు మాత్రమే ఈ సౌకర్యం ఉండేదనిప్ ప్రస్తుతం ఈ ఉత్తర్వులవలన ఏటా 35 రోజులు సెలవలు అర్హత ఉన్న శాశ్వత ఉద్యోగులకు కూడా ఈ అదనపు 5రోజులు సెలవులకు అర్హత లభిస్తుందని అన్నారు. దీనితో ఏటా మహిళా రెగ్యులర్ ఉద్యోగులకు 40 రోజులు సెలవలు పొందవచ్చని ఉద్యోగ సంఘ నాయకులు దుర్గారావు, కృష్ణవేణి అన్నారు. ఈ ఉత్తర్వులు రాష్ట్ర ఏ.పి.ఎన్.జి.ఓ కృషి వలనే ప్రభుత్వం జారీ చేసిందన్నారు.

నేటి నుంచే అమ్మకు సంబరాలు ప్రారంభం

- జామి ఎల్లారమ్మ జాతరకు అంతా సిద్ధం
- నేడు తొలేళ్ళు ఉత్సవం..రేపు పెద్ద తీర్థం
- బందోబస్తు ఏర్పాట్లు చేసిన పోలీసులు
- రెండు లక్షల మందికి పైగా వస్తారని అంచనా

విశాలాంధ్ర-జామి : ఉత్తరాంధ్రలో పేరెన్నికగన్న జామి శ్రీఎల్లారమ్మ జాతరకు వేళయింది. అమ్మకు గురువారం నుంచి మూడు రోజులపాటు జాతరను నిర్వహించనున్నారు. అందులో భాగంగా ఇప్పటికే అన్ని ఏర్పాట్లు చేయడం జరిగింది. ఉత్తరాంధ్రలో జరుగుఈంతున్న అనేక పెద్ద పండగలలో జామి ఎల్లారమ్మ తల్లి జాతర ఒకటిగా చెబుతారు. మహాశివరాత్రి అనంతరం 9వరోజు వచ్చే అష్టమి రోజున ఈపండగను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. అమ్మవారిని గద్దెనుంచి ఆలయానికి తీసుకువెళ్ళేందుకు వేదపండితులు ముహుర్తాన్ని నిర్ణయించారు. అమ్మవారిని మేళ తాళాలతో, వివిద సాంస్కృతిక కార్యక్రమాలతో ఊరేగింపుగా ఆలయానికి తీసుకువెళ్తారు. గురువారం తొలేళ్ళ ఉత్సవం జరుగుతుంది. రాత్రి అమ్మవారి ఊరేగింపు ఘనంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ తగిన ఏర్పాట్లు చేసింది. శుక్రవారం పెద్దతీర్థం నిర్వహిస్తారు. ఈతీర్థంకు భక్తులు వేలాదిగా తరలివస్తారు.

ఏర్పాట్లు పూర్తి చేసాం : ఆలయ ఇవో ఎం. ప్రసాదరావు

ఈ ఏడాది అమ్మవారి జాతరను నిర్వహించేందుకు ఆలయ కమిటీ లేనందున తాత్కాలికంగా గ్రామ పంచాయతీ సర్పంచ్ సహకారంతో నిర్వహించడం జరుగుతోంది. అయినా గతం కన్నా ఏమాత్రం తగ్గకుండా ఏర్పాట్లు చేసాం. ఆలయం వద్ద భక్తులకు తాగునీటి సదుపాయాన్ని, ఎండలో నీడను ఏర్పాటు చేసాం. బారికేడ్లును తగిన విధంగా ఏర్పాటు చేసి క్యూలైన్లును సిద్ధం చేసాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఏర్పాట్లు చేస్తున్నాం.

గత ఏడాదికన్నా ఘనంగా చేస్తాం : అల్లు పద్మ, ఉత్సవ నిర్వాహకురాలు, ఉపసర్పంచ్

గతంలో కన్నా ఈఏడాది మరింత ఘనంగా జాతరను నిర్వహించేందుకు అన్ని విదాలా ప్రయత్నిస్తున్నాం. భక్తులకు పంచాయతీ పరంగా తగిన సౌకర్యాలు ఏర్పాటు చేసాం. గ్రామంలోనుంచి ఆలయానికి విద్యుత్ దీపాలతో అలంకరణ చేసాం. తొలేళ్ళ ఉత్సవం రోజున రాత్రి భక్తులను ఆలరించేందుకు పలు ప్రాంతాలలో సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేసాం. జాతర నిర్వహణ అంతా మేం గ్రామ పెద్దలుగా చేస్తున్నా ఆర్థిక లావాదేవీలు అంతా దేవాదాయశాఖ అధికారులే చూసుకుంటున్నారు. దాతల సహకారంతో పలు కార్యక్రమాలను చేపడుతున్నాం.

200 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు : ఎస్ఐ వీరజనార్ధన్... శ్రీఎల్లారమ్మ జాతరకు సంభందించి ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పూర్తి స్థాయిలో పహారా ఏర్పాటు చేస్తున్నాం. దాదాపు 200మంది సిబ్బందిని జాతరకు వినియోగిస్తున్నాం. అమ్మవారి ఊరేగింపుకు అవసరమైతే రోప్‌పార్టీని ఏర్పాటు చేస్తాం. జేబుదొంగలను, అసభ్యంగా ప్రవర్తించేవారిని గుర్తించేందుకు మఫ్టీలో కొందరు పోలీసులును ఏర్పాట్లు చేస్తున్నాం. జాతర సందర్భంగా పలు చోట్ల ట్రాఫిక్ మార్పులు చేసాం.

నేడు మద్యం షాపులకు డ్రా

విశాలాంధ్ర-శృంగవరపుకోట : విజయనగరం జిల్లా పరిదిలో గీత కులాలకు/ సొండి కులానికి కేటాయించిన మద్యం షాపులకు వచ్చిన ధరఖాస్తులకు గురువారం జిల్లా కలెక్టర్ ఆఫీసు నందుగల ఆడిటోరియం హాలు నందు జిల్లా కలెక్టర్ వారి సమక్షంలో డ్రా తీయబడునని దరఖాస్తుదారులందరు పై సమయమునకు తప్పనిసరిగా హాజరు కావాలని ఎస్.కోట ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ సీఐ సిహెచ్ రాజేష్ బుధవారం తెలియజేశారు.

అగ్ని ప్రమాద నివారణపై అవగాహన

విశాలాంధ్ర-బాడంగి : అగ్ని ప్రమాద నివారణపై విద్యార్థులకు పూర్తి అవగాహన కలిగి ఉండాలని ఫైర్ స్టేషన్ అధికారి ఈ రామ సన్యాసిరావు తెలిపారు. స్థానిక సాయి వాగ్దేవి రెసిడెన్స్ స్కూల్‌లో బుధవారం విద్యార్థులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదాలు జరిగేటప్పుడు తగు జాగ్రత్తలను తీసుకోవాలని అన్నారు. విద్యుత్ అగ్నిప్రమాదం జరిగేటప్పుడు పొడి ఇసకతో ఆర్పాలన్నారు. పొగ ఎక్కువగా ఉన్న సందర్భంలో నేలపై పాకి బయటకు రావడానికి ప్రయత్నించాలని అన్నారు. ఎక్కడైనా అగ్నిప్రమాదం జరిగితే వెంటనే ఫైర్ స్టేషన్కు ఫోను చేయాలని అన్నారు. అగ్ని ప్రమాదం నివారణపై విద్యార్థులు అవగాహన కల్పించుకోవడంతో పాటు గ్రామాల్లో ఉన్న వృద్ధులకు కూడా అవగాహన కల్పించాలని కోరారు. ఈకార్యక్రమంలో సిహెచ్ వి రమణ, జి అప్పలరజు విఎల్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

మహిళల సంక్షేమమే 'దీక్ష మహిళ వెల్ఫేర్' లక్ష్యం

విశాలాంధ్ర-బాడంగి : మహిళల సంక్షేమమే దీక్ష మహిళ వెల్ఫేర్ లక్ష్యంగా పనిచేస్తుంది.ఈ మహిళా వెల్ఫేర్ సొసైటీ మరియు మండలి సీఈవో ఎల్ శాంతి సొసైటీని 1999 సంవత్సరంలో ప్రారంభించారు ఈ సొసైటీలో పలు సామాజిక కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుంది నిరంతరం వ్యవసాయ కార్యక్రమాల్లో భాగంగా సేంద్రియ పద్ధతుల్లో రైతులు తక్కువ పెట్టుబడితో వ్యవసాయం చేస్తే సాంకేతిక సలహాలను సూచనలను ఇవ్వడం జరుగుతుంది. నాబార్డ్ సహకారంతో గ్రామీణ మహిళలకు వారి జీవనోపాధి మెరుగుపడేందుకు వ్యాల్యూ ఎడిషన్ పై శిక్షణ ఇచ్చి వారి వద్ద నుండి మరల వారు తయారు చేసినటువంటి వస్తువులను తీసుకుని మరల మార్కెటింగ్ చేయడం జరుగుతుంది. వివిధ శాఖల ద్వారా రైతులకు అన్ని విధాల సహాయ సహకారాలు జరుగుతుంది. ఈ సంస్థ ద్వారా నాబార్డ్ సహకారంతో బాడంగి సాలూరు కొమరాడ మండలాల్లో ఎఫ్ పి ఓ లను నడిపించడం జరుగుతుంది. వ్యవసాయ శాఖ ఆర్టికల్చర్ ఆర్ఎస్ ఏఆర్ఎస్ ఐసిఎంఆర్ మొదలగు శాఖల ద్వారా ఎస్సీ ఎస్టీలకు నూతన సాంకేతిక సలహాలు ఇచ్చి విత్తనాలను పంపిణీ చేయడం జరుగుతుంది. గుంజి సహకారంతో గ్రామీణ ప్రాంతాల్లో వారి యొక్క పరిసరాలలో పరిశుభ్రత పాటించినప్పుడు గుంజి సహకారంతో కొన్ని కిట్లను పంపిణీ చేయడం జరుగుతుంది. సాలూరు మండలంలో తోనం పంచాయతీలో గల 16 గ్రామాలను తీసుకుని ఎస్టీ రైతులకు జీడి మామిడి తోటలో పలు పంటలను వేయించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయడం జరిగింది. వీరితో ఆయా పంటలలో తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభం వచ్చే విధంగా వారి జీవనోపాదులను మెరుగుపరిచే విధంగా వారికి శిక్షణ ఇవ్వడం జరుగుతుంది. ఆయా గ్రామాల్లో కొంతమందిని యువకులను తీసుకొని ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించడం వ్యవసాయ విధానంలో సాంకేతిక సలహాలు ఇవ్వడం 16 గ్రామాల్లో ప్రతి రైతుకు వారి యొక్క మౌలిక సదుపాయాల్లో కల్పించడం ప్రభుత్వంతో వారిని అనుసంధానం చేయడం జరుగుతుంది. దీక్ష మహిళ వెల్ఫేర్ సొసైటీ ద్వారా ఉచిత కంటి పరీక్షలు చేసి వారిని కేటరేట్ ఆపరేషన్కు పంపించడం జరుగుతున్నది. కొన్ని ప్రాంతాల్లో ఆరోగ్య సంబంధమైన హెల్త్ క్యాంపులు పెట్టి వారికి లీ ఫార్మసీ ద్వారా పోషక పదార్థాలు కిట్లు పంపిణీ చేయడం జరుగుతుంది. గ్రామానికి ప్రాంతాల మహిళలకు కుట్టు మిషన్లు ఉచితంగా ఇచ్చి టైలరింగ్ పై శిక్షణ ఇవ్వడం జరిగింది. మహిళలు వారి యొక్క జీవన ప్రమాణం మెరుగుపరిచేందుకు దీక్ష సి ఇ ఓ ఎల్ శాంతి అన్ని విధాల కృషి చేస్తున్నారు.

కొవ్వొత్తులతో ర్యాలీ

విశాలాంధ్ర-వంగర : అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో భాగంగా విజయనగరం జిల్లా రాజాం ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలోమద్దువలస అంగన్వాడీ కార్యకర్త షావుకారి మీనా కుమారి ఆధ్వర్యంలో మహిళా హక్కులపై. మంగళవారం సాయంకాలం కొవ్వొత్తితో ర్యాలీని నిర్వహించారు. మహిళలకు హక్కులపై అవగాహన కల్పించారు. బాల్యవివాహాలు పై క్షుణంగా వివరించారు. ఈ కార్యక్రమంలో మహిళలు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి

విజయనగరం రైతు సంఘం సమన్వయ కమిటీ విజ్ఞప్తి

జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద నిరశన

విశాలాంధ్ర-విజయనగరం కంటోన్మెంట్ : రైతులకు కేంద్ర ప్రభుత్వం సి2ం 50% ఫార్ములా ప్రాతిపదికన మద్దతు ధరల చట్టం తీసుకురావాలని రైతు కూలీ సంఘము నాయకులు డిమాండ్ చేసారు. బుధవారం కలెక్టరెట్ వద్ద రైతులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు, కన్వీనర్ బి. రాంబాబు మాట్లాడుతూ రైతులకు రుణమాఫీ చేయాలని, సమగ్ర పంటల బీమా అమలు చేయాలని కోరారు. వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ల గుప్పిట్లో పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం తెచ్చిన డిజిటల్ అగ్రి మిషన్ రద్దు చేయాలన్నారు. నేషనల్ ఫ్రేమ్ వర్క్ ఆన్ అగ్రికల్చర్ మార్కెట్స్, వ్యవసాయ మార్కెట్లను నిర్వీర్యం చేసే విధానమని మండి పడ్డారు. సహకార రంగాలను నిర్వీర్యం చేసే బహుళ సహకార వ్యవస్థ అమలుకు వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు. కౌలు రైతులుకు ప్రభుత్వ పథ కాలు అందించాలన్నారు. రైతులకు పెట్టుబడి సహాయం వెంటేనే రూ.20వేలు రూ అందించాలన్నారు. పేదలు సాగులో వున్న భూములు కు పట్టాలు ఇవ్వాలన్నారు. రైతులకు, కౌలు రైతులు కు వ్యవసాయ కార్మికులు కు 60సం "కు 10000పెన్షన్ ఇవ్వాలన్నారు. విద్యుత్ సవరణ బిల్లు వెనక్కి తీసుకొని స్మార్ట్ మీటర్లు పెట్టే ఆలోచన వెనక్కి తీసుకొవాలన్నారు. ఉపాధి హామీ పథకం కూలీలు కు రోజులు పెంచి 600రూ వేతనం ఇవ్వాలన్నారు. జిల్లా లో జీడి, మామిడి వాతావరణ పరిస్థితి లో పంట తీవ్ర నష్ట పోతున్న రైతు లను అదుకోవాలని కోరారు. పాల రైతులు కు రాష్ట్ర ప్రభుత్వం లీటర్ కు 5రూ ప్రోత్సాహ కంగా ఇవ్వాలని,తుఫాను, చీడ పీడలు కు గురైన పంటలకు నష్ట పరిహారం ఇవ్వాలన్నారు. జిల్లాలో మూత బడిన సుఘర్ ఫ్యాక్టరీలను తెరిపించాలని, సాగు నీటి ప్రాజెక్టులకు నిధులు ఇచ్చి పెండింగ్ పనులు వెంటనే పూర్తి చెయ్యాలన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ లు పెట్టాలని, జిల్లా లో వివిధ ప్రాజెక్టు క్రిందభూ సేకరణ లో కోల్పోయిన రైతులకు 2013చట్ట ప్రకారం 3రెట్లు పరిహారం ఇవ్వాలని, అపరాలు మద్దతు ధర పొంద లేక నష్ట పోయిన రైతులకు 1000రూ ధరల స్థిరీకరణ నిధి నుంచి ఇవ్వాలని డిమాండ్ చేసారు. ఎపి పాల రైతు లు సంఘం జిల్లా కార్యదర్శి గొంప కృష్ణ మూర్తి, వ్యవసాయ కార్మికులు సంఘం జిల్లా కార్యదర్శి గాడు అప్పారావు, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస నాయుడు, కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి రాకోటి రాములు, కౌలు రైతులు సంఘం జిల్లా నాయకులు కనిరెడ్డి నారాయణ, సిరికి వెంకట సత్య నారాయణ, రైతు సంఘం జిల్లా నాయకులు తమటపు పైడిపు నాయుడు, సురేష్, రైతు సంఘం నాయకులు దేవర జగన్,ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి దే గల అప్పలరాజు , ఎపి వ్యవసాయ కార్మికులు సంఘం అధ్యక్షుడు భీముదు, రైతు సంఘం నాయకులు గోళ్ళ అప్పారావు, సత్య నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఈశ్రమ్ నమోదు వేగంగా పూర్తి చేయాలి

- బాలకార్మికులను గుర్తించేందుకు స్పెషల్ డ్రైవ్
- లేబర్ సెస్ వసూలు చేయండి
- జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : జిల్లాలోని అసంఘటిత రంగంలోని కార్మికులందరినీ ఈశ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసే ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆదేశించారు. పిఎఫ్, ఈఎస్ఐ సదుపాయం లేని, నెలకు రూ.15వేలు కంటే తక్కువ ఆదాయం ఉన్న వారంతా అసంఘటిత రంగ కార్మికులుగా పరిగణిస్తారని చెప్పారు. ఇప్పటివరకు సుమారు 5 లక్షలమందిని నమోదు చేయడం జరిగిందని, మరో 3 లక్షలు మంది వరకు ఉంటారని, వీరి పేర్ల నమోదును త్వరగా పూర్తి చేయాలన్నారు.కార్మికశాఖకు సంబంధించిన ఈ శ్రమ్, లేబర్ సెస్ వసూలు, బాల కార్మికుల నిర్మూలన మొదలగు అంశాలపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టరేట్లో బుధవారం సమావేశాలను నిర్వహించారు. ఆయా కార్యక్రమాల అమలుపై ఈ సమావేశంలో కలెక్టర్ సమీక్షించారు. ఈ శ్రమ్ పోర్టల్‌లో అసంఘటిత రంగ కార్మికులను నమోదు చేయడం ద్వారా వారికి ప్రభుత్వం పలు అందిస్తున్న పలు సదుపాయాలను వర్తింప జేయవచ్చునని సూచించారు. ప్రతీ ప్రభుత్వ శాఖ తమ పరిధిలోని అసంఘటిత కార్మికులను ఈ పోర్టల్‌లో నమోదు చేయాలని చెప్పారు. పేరుకుపోయిన లేబర్ సెస్ వసూలుపై దృష్టి పెట్టాలన్నారు. మొత్తం నాలుగు విభాగాల్లో ఒక్క విజిలెన్స్ అలర్ట్ క్రింద సుమారు రూ.12 కోట్లు వరకు బకాయి ఉందని చెప్పారు. వీలైనంత త్వరగా దీనిని వసూలు చేయడమే కాకుండా, పెండింగ్‌లో ఉన్న సుమారు 1300 క్లెయిములను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. బాల కార్మిక వ్యవస్థను పూర్తిగా నిర్మూలించాల్సిన అవసరం ఉందని కలెక్టర్ అన్నారు. ఎక్కడా 18 ఏళ్లలోపు పిల్లలను పనికి వినియోగించకూడదని, వారిని పాఠశాలలకు తరలించాల్సి ఉందని చెప్పారు. బాల కార్మికులను గుర్తించేందుకు వివిధ శాఖలు సంయుక్తంగా స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని ఆదేశించారు. అవసరమైతే దీనికోసం పోలీసు శాఖను కూడా వినియోగించుకుంటామని ప్రకటించారు. అలాగే చిన్నపిల్లలను పనిలో పెట్టుకొనేవారిపైనా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్మికశాఖ మరింత క్రియాశీలకంగా వ్యవహరించి, బాల కార్మికులను గుర్తించాలని సూచించారు. వెట్టి చాకిరీ, మానవ అక్రమ రవాణాలపై ముద్రించిన పోస్టర్లను ఈ సందర్భంగా ఆవిష్కరించారు.ఈ సమావేశాల్లో ఇన్‌ఛార్జి జెసి ఎస్.శ్రీనివాసమూర్తి, డిసిఎల్ ఎస్.ప్రసాదరావు, ఏసిఎల్ హెచ్‌టి శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

జిల్లా అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

పిఎం విశ్వకర్మ పథకానికి ప్రాధాన్యత ఇవ్వండి : కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్

విశాలాంధ్ర-విజయనగరం రూరల్ : విరివిగా రుణాలను మంజూరు చేయడం ద్వారా జిల్లా అభివృద్ధిలో బ్యాంకులు భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ పిలుపునిచ్చారు. ముఖ్యంగా పిఎం విశ్వకర్మ యోజనకు ప్రాధాన్యత ఇచ్చి రుణాలను మంజూరు చేయాలని బ్యాంకర్లను కోరారు. ఈ పథకం అమలుకు కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, అందువల్ల వచ్చిన ప్రతీ దరఖాస్తును పరిశీలించి, వీలైనంత త్వరగా మంజూరు చేయాలని సూచించారు. స్వయంశక్తి సంఘాలకు రుణాల మంజూరు, ఇతర ప్రభుత్వ పథకాల అమలుపై సెర్ప్, డిఆర్డిఏ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఆడిటోరియంలో బుధవారం బ్యాంకర్లకు వర్క్‌షాప్ నిర్వహించారు.జిల్లా కలెక్టర్ అంబేద్కర్ మాట్లాడుతూ ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకానికి వచ్చిన అన్ని ధరఖాస్తులను ఆమోదించి, వెంటనే గ్రౌండింగ్ అయ్యేలా చూడాలన్నారు. అదేవిధంగా ముద్ర రుణాలను విరివిగా మంజూరు చేసి ఉపాధి కల్పించాలని సూచించారు. స్టాండప్ ఇండియా పథకం క్రింద ఇప్పటివరకు చేసిన మంజూరుపట్ల సంతృప్తిని వ్యక్తం చేస్తూ, యూనిట్ల సంఖ్యను మరింత పెంచాలని కోరారు. ప్రధానమంత్రి సూర్యఘర్ పథకంలో భాగంగా రుణం కోసం వచ్చే ప్రతీ ధరఖాస్తును ఆమోదించి మంజూరు చేయాలని అన్నారు. ఈ పథకం అమలును జిల్లాలో వేగవంతం చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఈ నాలుగు పథకాల అమలుకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నాయని, ఈ మేరకు బ్యాంకర్లు కూడా తమవంతు సహకారాన్ని అందించాలని కలెక్టర్ కోరారు.వర్క్‌షాప్‌లో డిఆర్‌డిఏ పిడి ఎ.కల్యాణచక్రవర్తి, ఎల్‌డిఎం వివి రమణమూర్తి, జిల్లా కేంద్ర సహకార బ్యాంకు సిఈఓ ఉమామహేశ్వరరావు, ఎస్‌బిఐ ఇతర బ్యాంకుల ఉన్నతాధికారులు, డిఆర్‌డిఏ సిబ్బంది పాల్గొన్నారు.

10న కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాను విజయవంతం చేయండి

ఆటో కార్మికులకు సిఐటియు పిలుపు

విశాలాంధ్ర-జామి : స్థానిక జామి బస్టాండ్‌లో ఆటో కార్మికులులతో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కాకి సురేష్ బుధవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆటో యూనియన్ జిల్లా కన్వీనర్ కె.సురేష్ మాట్లాడుతూ రోజురోజుకి నిరుద్యోగం తీవ్రత అవుతున్న కొద్ది బ్రతకడం కోసం ఆటోలు,క్యాబ్,లారీలు ఇతర వాహనాలలో కార్మికులు బ్రతుకుతున్నారు. వీరిని ఆదుకోవడానికి కేరళ తరహా సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి వారికి అర్థికసహాయం చేయకపోగా అటువైపు ఆలోచించకుండా నష్టం చేసే విధంగా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు వీరికి అన్యాయం చేస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం 2019లో వాహన చట్టాన్ని తెస్తూ డ్రైవర్ మెడకు ఉరితాడు బిగించింది.ఇది అమలు చేసిన పిదప జైలు శిక్షలు,అపరాధ రుసుముల రూపంలో ఆర్థిక భారాలు వేసి ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి. కార్పొరేట్ కంపెనీలు రవాణా రంగంలో చొరబడి వారి వాహనాలలో రవాణా జరిగి ఇప్పటికే బతుకుతున్నా చిన్న చిన్న ట్రాన్స్పోర్ట్ లు కార్మికులందరూ తీవ్రంగా నష్టం చేసి ఇంటికి పంపించే ప్రక్రియకు దోహదం చేస్తుంది.ఆటోలకు పార్కింగ్ స్థలాలు,స్టాండ్లు ప్రభుత్వాలు చూపడం లేదు.పెట్రోల్,డీజిల్ భారాన్ని నిరంతరం పెంచుతున్నారు. అధికారులు, పోలీసుల వేధింపులు ముమ్మరంగా చేస్తున్నారు. ఇలాంటి పరిస్థితులలో ఐకమత్యంగా పోరాటం చేసి ఆటో కార్మికులు తమ హక్కులు కాపాడుకోవడం కోసం పోరాటాలు నిర్వహించడమే సరైన మార్గమని ఆయన పిలుపునిచ్చారు. మోటర్ వాహన చట్టాన్ని రద్దు చేస్తూ ప్రభుత్వం ప్రకటించాలని, రవాణా కార్మికలకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి సంక్షేమాన్ని అమలు చేయాలని,రావణా రంగ కార్మికుల సమస్యలు పరిష్కారం చేయాలని డిమాండ్ చేస్తూ మార్చి 10న చలో కలెక్టర్ ఆఫీసు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని దానికి అన్ని స్టాండ్లు నుంచి రావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు. అప్పల కృష్ణ, పైడిరాజు, సూర్యనారాయణ, కిషోర్, రమణ, కిరణ్,రాజు తదితరులు పాల్గొన్నారు.

గాలి కుంటువ్యాధిపై జాగ్రత్తగా ఉండాలి

విశాలాంధ్ర-బాడంగి : మండలం కోడూరు గ్రామం పంచాయతీ పరిధిలో ఉన్న అత్చయపేట, కోడూరు హాస్పిటల్ సెంటర్ కోడూరు గ్రామం బీసీ వలస గ్రామం మండల పశు వైద్య అధికారి డాక్టర్ ఎం.సతీష్ కుమార్ నాయుడు ఆద్వర్యంలో గాలి కుంటు వ్యాధి నివారణ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గాలి కుంటీ వ్యాధిపై జాగ్రత్తగా ఉండాలని ఆయన సూచించారు. ముందుగా జాగ్రత్త తీసుకుంటే పశువులకు ఎటువంటి ప్రమాదం జరగదని ఆయన తెలిపారు. ఈ వేద నివారణ కోసం ప్రభుత్వం వేస్తున్న టీకాలను పశువులకు వేయించాలని కోవాలని కోరారు ఈ కార్యక్రమంలో నాగేందర్ తో పాటు పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

సమ్మర్ క్రాస్ ప్రోగ్రాం ప్రారంభం

విశాలాంధ్ర-శృంగవరపుకోట : రూరల్ వాటర్ సప్లై డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో మండలం లో ఉన్న తాగునీటి బోర్ల మరమ్మత్తుల నిమ్మితం నిర్వహించబోతున్న సమ్మర్ క్రాస్ ప్రోగ్రాం ని బుడవారం మండల ప్రజాపరిషత్ భవనం లో ఎంపీపీ సండి సోమేశ్వరావు ఆధ్వర్యం లో వైస్ ఎంపీపీ , రాష్ట్ర టూరిజం శాఖ డైరెక్టర్ ఇందుకూరి సుధారాణి కలిసి జెండా ఊపి కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా సుధారాణి మాట్లడుతూ మండలం లో ఉన్న అన్ని పంచాయతీలలో ఈ కార్యక్రమం ఉపయోగించుకోవాలని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సతీష్ ,ఆర్ డబ్లు ఎస్ జెఇ ,ఎస్ కోట మేజర్ పంచాయతి సర్పంచ్ గనివాడ సంతోషి కుమారి, ఎంపీటీసీ వాకాడ సింహాచలం వార్డ్ మెంబెర్ భారతి , నాయకులు బోజంకి గోవింద్ , వసి వెంకటరావు, ఛామలపల్లి బుజ్జి ,వబ్బిన సతీష్ , వాకాడ రమణ ,గనివాడ రవి మరియు సిబ్బంది పాల్గొన్నారు.

బెల్ట్ షాపుల నిర్వహణపై గ్రామ పెద్దలతో సమావేశం

విశాలాంధ్ర-తెర్లాం : తెర్లాం మండలంలో ఉద్దవోలు గ్రామంలో బొబ్బిలి సిఐ నారాయణరావు, తెర్లాం ఎస్ఐ సాగరబాబు పోలీస్ బృందంతో బెల్ట్ షాపుల నిర్వహణపై ఆ గ్రామ పెద్దలతో బుధవారం సాయంత్రం సమావేశం నిర్వహించారు. గ్రామంలో ఉన్న ప్రజలు అందరికీ బెల్ట్ షాప్‌లు, అక్రమంగా వేలం పాటలు లాంటి వాటిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించడం జరిగింది అని, అలాగే బెల్ట్ షాపులు నిర్వహిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని తెలిపారు అని, అదేవిధంగాగా రోడ్డు సేఫ్టీ, సైబర్ నేరాలు, గంజాయికి సంబంధించి ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది అని బొబ్బిలి సిఐ ఒక ప్రకటనలో పత్రిక విలేకర్లతో తెలిపారు.

గాదే విజయంపట్ల పిఆర్‌టియు సంబరాలు

విశాలాంధ్ర-చీపురుపల్లి : పిఆర్‌టియు చీపురుపల్లి మండల శాఖ ఆధ్వర్యంలో చీపురుపల్లి ఎంఆర్సి దగ్గర గాదే శ్రీనివాసులనాయుడు ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా ఎన్నికైన సందర్భంగా కేక్ కట్‌చేసి సంబరాలు జరుపుకున్నారు. గాదె విజయం పట్ల పిఆర్‌టియు సభ్యులంతా ఆనందాన్ని పంచుకుంటూ పిఆర్‌టియు జిల్లా అధ్యక్షుడు వలిరెడ్డి రవీందర్ నాయుడు కేక్ కట్ చేశారు. స్వీట్లు పంచుకుంటూ ఉపాధ్యాయులు అందరూ సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు ఎం.జగన్నాథం, మండల ప్రధాన కార్యదర్శి ఎమ్మెస్ ప్రసాద్, జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు ఆల్తి వెంకటమ్మ, జిల్లా మహిళా కార్యదర్శి ఎంవి భారతి, మురళి, ఎస్.వి.నాయుడు, జానకిరామ్ సూర్యనారాయణ, కే అప్పలనాయుడు కే.సన్యాసిరావు పాల్గొన్నారు.